

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :13   సంచిక: 8   హైదరాబాద్      2013 నవంబర్   పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com**   వార్షిక సభ్యత్వం : రూ.100/-

# అవతారుని 45వ అమరతిథి

అవతారుని 45వ అమరతిథి రెండున్నర రోజులపాటు 2014 జనవరి 30 ఉదయం 8 గంటల నుండి ఫిబ్రవరి 1 మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నారు. కాగా, 2014 జనవరి 31వ తేదీ అత్యంత ప్రధానమైన రోజు. ఆ రోజున అవతార్ మెహెర్‌బాబా సమాధి ఎదురుగా మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకు బాబా ప్రేమికులందరూ మౌనం పాటించే సమయమని ప్రత్యేకంగా గుర్తించాలి.

**వసతి సదుపాయం**

మెహెరాబాద్‌లో వసతి సౌకర్యం కోరుకునే యాత్రికులు ఒక్కొక్కరికి రూ. 50/- ల చొప్పున నగదును "అమరతిథి డొనేషన్స్" పేరిట పోస్టల్ మనీ ఆర్డరు లేదా బ్యాంక్ డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా మెహెర్‌బాబా ట్రస్టు అడ్రస్సు - 'అమరతిథి డొనేషన్స్", అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి. ట్రస్టు, పోస్ట్ బ్యాగ్ నెం. 31, కింగ్స్ రోడ్, అహ్మద్ నగర్, మహారాష్ట్ర - 414 001. పంపాలి. ఇందుకు ఆఖరు తేది 2014 జనవరి 7.

ఏడు సంవత్సరాల లోపు పిల్లలకు ఎలాంటి సొమ్ము వసూలు చేయరు. ఎలక్ట్రానిక్ మనీఆర్డర్ ద్వారా మీరు "అమరతిథి డొనేషన్స్" పంపుతున్న ఎడల మీ పేరు ప్రక్కనే ఎంతమంది పురుషులు / స్త్రీలు తెలియచేయాలని కోరుతున్నారు. ముందుగా నగదు పంపలేని పక్షంలో 2014 జనవరి 30, 31 తేదీల్లో దిగువ మెహెరాబాద్‌లోని విచారణ కౌంటర్ల వద్ద ఒక్కొక్కరికి రూ. 100/- చొప్పున చెల్లించవలసి ఉంటుందని ట్రస్టు సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**పరుపులు:** పరుపుల కాంట్రాక్టరు రెండు రోజుల బసకు ఒక్కొక్క పరుపుకు రూ. 50/- చొప్పున అద్దెకు ఇవ్వనున్నారు. ఇందుకోసం ముందుగా -శ్రీమతి ఉషా.అశోక్ సేర్, బంగ్లా నెం. 93, ఉషాకాల్, ఆనంద్‌నగర్, గుల్‌మొహర్ రోడ్, అహ్మద్‌నగర్, మహరాష్ట్ర - 414 003 కు తగిన నగదును మనీ ఆర్డర్ ద్వారా పంపవలెను.

భజనలు, పాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించదల్చుకునేవారు,

శ్రీ మెహెర్‌నాథ్ బి.కల్చూరీ, ట్రస్టీ, అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి. ట్రస్టు, పోస్ట్ బ్యాగ్ నెం. 31, కింగ్స్ రోడ్, అహ్మద్‌నగర్, మహరాష్ట్ర - 414 001, అనే చిరునామాకు 2012 డిసెంబరు 31వ తేదీ లోగా తెలియజేయాల్సిందిగా కోరుతున్నారు.

**అమరతిథికి వెళ్ళడానికి, అవతారుని ఆశీశ్శులు అందుకోవడానికి నేటి నుండే సిద్ధంకండి!**

*

# బాబా సందేశం

Whoever works for ME works for his ownself.

నా సేవ ఎవరు చేస్తారో అది వారి ఆధ్యాత్మిక ఉన్నతికే దోహదపడుతుందని గమనించండి.

**–మెహెర్‌బాబా**


**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595–53218,**
**040-27860079**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**


## లోపలి పేజీలలో...


1. సంపాదకీయం 5
2. భావూ కల్చూరి – **అక్షర నీరాజనం** 6–16
3. భావూతో ఫోటో 17
4. మూగబోయిన తెలుగువారి రెస్ట్ హౌస్ 18
5. మెహెరాస్తానా 19
6. లార్డ్ మెహెర్ 20–27
7. సలామ్, భావూజీ – **నివాళి** 28–32
8. పసిడి పండుగ వేడుకలు 33–34
9. మా మాటలు 35–36
10. కొత్త పుస్తకం 37



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్–500 087
ఫోన్: 99595–53218


**కవర్ పేజి చిత్రం పంపినవారు**
**సుధాకర్, బందరు.**

### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# తాడేపల్లిగూడెం కేంద్ర పున:ప్రారంభోత్సవము

తాడేపల్లిగూడెం కేంద్ర పున:ప్రారంభోత్సవము 2013 డిసెంబరు 7 తెల్లవారుఝామున 5 గంటలకు జరుపుతున్నట్లు కేంద్ర కార్యదర్శి శ్రీ వీర్నాయుడు (95420 90214) ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర జిల్లాల నుంచి వచ్చేవారికి డిసెంబరు 4 సాయంత్రం నుండి తగిన భోజన-బస ఏర్పాట్లు చేశామని, విచ్చేసే బాబా ప్రేమికులు తమ వివరాలు ముందుగా తెలియజేయవల్సిందిగా శ్రీ నాయుడు కోరుతున్నారు.

# జొన్నాడలో అఖండ నామం

**2013 అక్టోబరు 29 నుండి 2014 ఫిబ్రవరి 25 వరకు**

అవతార్ మెహెర్‌బాబా 120వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తూర్పు గోదావరి జిల్లా, ఆలమూరు మండలం, జొన్నాడ గ్రామంలో గల అవతార్ మెహెర్‌బాబా సెంటర్‌లో 120 రోజులు, అనగా 2013 అక్టోబరు 29 నుండి 2014 ఫిబ్రవరి 25 వరకు ఉదయం 6 నుండి సా. 6 వరకు, మరియు ఆఖరి ఏడు రోజులు 24 గంటలూ **అఖండ ఏకనామం** ఏర్పాటుచేసినట్లు కేంద్ర అధ్యక్షులు శ్రీ తాడి జగన్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.

బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆహ్వానిస్తూ, విచ్చేసే బాబా ప్రేమికులందరికీ భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు శ్రీ తాడి రామమోహన్ రెడ్డి తెలిపారు. కాగా, బాబా ప్రేమికులు తమ రాక గురించి ముందుగా తెలియజేయవల్సిందిగా ఆయన కోరుతున్నారు.

మరిన్ని వివరాలకు **77020 97886, 94417 10432** సంప్రదించవల్సింది.

# గుంటూరు బాబా సెంటర్ స్వర్ణోత్సవాలు

## 2014 మార్చి 1,2 తేదీలలో

గుంటూరు బాబా సెంటర్ స్వర్ణోత్సవాలు **2014 మార్చి 1,2 తేదీలలో** మంగళగిరి రోడ్డులో గల అవతార్ మెహెర్‌బాబా మందిరంలో భారీ ఎత్తున ఏర్పాటుచేసినట్లు బాబా ప్రేమికులు శ్రీ కనకయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

వాలంటీర్లుగా పాల్గొనుగోరువారు అలాగే కార్యక్రమాలకు హాజరవ్వాలని కోరుకునేవారందరూ నిర్వాహకులకు సహకరించేలా తమ వివరాలను 2014 జనవరి 31 లోగా తెలియజేయవల్సిందిగా శ్రీ కనకయ్య (09885787719) కోరుతున్నారు.

## సంపాదకీయం తరమెళ్ళి పోయింది

మెహెర్‌బాబా మండలి సభ్యుడు, ట్రస్టు చైర్మన్ భావూ కల్చూరీ 2013 అక్టోబరు 23న పూనేలోని స్థానిక ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ తుది శ్వాస వదిలారు. గత కొంత కాలంగా భావూ అస్వస్థతతో వున్నారు. మెహెర్‌బాబా స్వయంగా ఎంపిక చేసుకున్న ధన్యజీవి భావూజీ. ఆయన మెహెర్‌బాబాను 1952 డిసెంబర్ 31న నాగపూర్‌కు సమీపంలోని సోనెర్ గ్రామంలో తొలిసారిగా దర్శించుకున్నాడు. తానెంతో కాలంగా ఎదురు చూస్తున్న భగవద్దర్శనం మెహెర్‌బాబాలో పొందానని, బ్రతికినంత కాలం అవతారుడి పాదాల చెంత అంకితమవ్వాలని ఆ క్షణంలోనే నిశ్చయించుకున్నానని, భావూజీ తన స్వీయ రచనలో చెప్పారు. “**నేను** నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి రెండు ఎం.ఏ.లు పూర్తి చేశాను. ఆపై చదువుపై శ్రద్ధ తగ్గింది. ఆధ్యాత్మికతపై దృష్టి మరలింది. చదువుపై ధ్యాస లేకపోవడంతో వార్ధాలోని గాంధీ ఆశ్రమం, ఆ పిదప రామకృష్ణాశ్రమాలకు వెళ్ళాను. ఐనా, నా మనస్సు కుదటపడ లేదు. భగవదన్వేషణలో హిమాలయ సానువుల్లో ఏదేనీ ఆశ్రమానికి వెళ్ళాలని రిషీకేశ్ లోని ఒక గురువు గారి అనుమతి కోరుతూ లేఖ రాశాను. ఆయన 1953 జనవరి 9 తర్వాత రమ్మనమన్నాడు. ఈ లోగా నాగపూర్ జిల్లాలో మెహెర్‌బాబా పర్యటిస్తున్నారని, పలుచోట్ల ప్రజా దర్శనం ఇస్తున్నారని స్థానిక పత్రికల్లో చదివాను. ఈ సమయంలో అవతారుని దర్శనం, ఆ పిదప ఆయనతో కొన్ని క్షణాలు మాట్లాడే అవకాశం లభించింది. నేనెంతో కాలంగా ఎదురు చూస్తున్న అవతారుడు నాకు లభించాడని ఇకపై ఆయన సన్నిధిలో శాశ్వతంగా ఉండిపోవాలని నా హృదయం హెచ్చరించింది. ఆ విషయాన్నే నా మాటల్లో మెహెర్‌బాబాకు చెప్పాను. అందుకు ఆయన విధించిన షరతులన్నింటికీ అంగీకరించాను. అప్పటికి నా వయస్సు 26 సంవత్సరాలు. భార్య, ఏడాదిలోపు కుమార్తె వున్నారు. సంసార బంధనాలన్నింటినీ సక్రమంగా సర్దుబాటు చేసుకుని 1953 జూలై 8న మెహెర్‌బాబా ఆశ్రమంలో సభ్యునిగా చేరాను”. మెహెర్‌బాబా యుగావతారుడు. భగవంతుడు. నమ్మి ఆయన దరి చేరండని, **“జపూ తుమ్‌హారా నామ్ మెహెర్”** – అని భావూ తన ప్రభోదాత్మక ప్రసంగాలలో యావన్మందిని ఉద్రూతలూగించాడు. బాబా ఆదేశాలతో భావూ ఎన్నో గ్రంధాలు, పాటలు, ఘజల్సు, పద్యాలు, కవితలు రచించాడు. 1973లో బాబా ట్రస్టు సభ్యునిగా, ఆ పిదప ట్రస్టు చైర్మన్‌గా మెహెరాబాద్ అభివృద్ధికే కాదు బాబా నామవ్యాప్తికి ఆ శేతు హిమాచలం పర్యటించాడు. గత 60 సంవత్సరాలుగా అవతారుని సేవకే అంకితమైన ధన్యజీవి భావూజీ. అవతార్ మెహెర్‌బాబా ప్రవచించిన ప్రేమ, విధేయత, నిజాయితీ, నిస్వార్ధసేవలను తన జీవితకాలంలో ఆచరణలో **అసాధ్యం** కాదని నిరూపించిన గొప్ప మహనీయుడు భావూజీ.

**భావూజీ బాబా ప్రేమికులందరికీ ప్రాత:స్మరణీయుడు.** *

అక్షర నీరాజనం

# భావూ కల్చూరి



పూణేలో చికిత్స పొందుతూ భావూజీ 2013 అక్టోబరు 23న తుదిశ్వాస విడిచారు.

మెహెర్‌బాబా 1969 జనవరి 31న భౌతికంగా దూరమయ్యాక బాబా ప్రేమికులందరికీ ఒక పెద్ద దిక్కులా ఉన్న భావూ ఇకపై ఆయన కనపడదు, అయన మాటలు వినపడవంటే తట్టుకోలేని ప్రేమికులు చాలామంది ఉన్నారు.

గత నాలుగు దశాబ్దాలుగా బాబా గురించి భావూజీ ప్రస్తావించిన విషయాలు చాలా భాగం గ్రంధస్తం అయ్యాయి.

ఇంకా ఎన్నో విషయాలు అముద్రితంగా వున్నాయి. వాటిని కనుక సంకలనం చేస్తే అదొక పెద్ద గ్రంధమే అవుతుంది. అవతారుని శరీర త్యాగానంతరం, ఐదు వేల పేజీలలో 8 సంపుటాలలో అవతారుని జీవితచరిత్రను కడు రమ్యంగా కళ్ళకుకట్టినట్లు సంకలనం చేసి బాబా ప్రేమికలోకానికి ఒక గొప్ప కానుకగా ఆయన అందజేశారు. ఈ రచన తనకు అవతారుడిచ్చిన ఆదేశమన్నారు. 1969 జనవరిలో ఒక రోజున, భావూజీని తులసీదాస్ రాసిన రామాయణాన్ని తన ఎదుట చదవమన్నారు బాబా. అలా చదవడం నాలుగైదు పేజీలు కూడా పూర్తికాకుండానే..."నీవు నా జీవిత చరిత్రను వ్రాయి" అని బాబా భావూజీ ఆదేశించారు. నీవు చాలా బాగా రాయగలవు. అది నాకు తెలుసు. ఎవరు ఏమన్నా నీవు పట్టించు కోవద్దు.

నీ రచనా శైలి నాకు నచ్చిన తర్వాత నీకింకేమిటి భయం!
అని బాబా అభయమిచ్చారు భావూజీకి.
బాబా స్వయంగా ఎంపిక చేసుకున్న ధన్యుడు భావూ!!
భావూజీ బాబాకు ప్రత్యేకం.
భావూజీ బాబావారి ప్రవచనాలను తు.చ తప్పక పాటించిన ధన్యజీవి.
బాబా సందేశాలు సరళంగా, సున్నితంగా ఉంటాయి.
బాబా సందేశాలు ఆచరణలో అమలు చేయడం అసాధ్యం కాదని నిరూపించిన గొప్ప వ్యక్తిగా భావూజీ బాబా ప్రేమికలోకానికి ఆచంద్రార్కం గుర్తుంటారు.
ఆయన వ్యక్తిత్వం అజరామరం.
**భావూజీ బాబా పరిధిలోకి ఎలా వచ్చారు? మెహెర్‌బాబాతో వారి తొలినాళ్ళ పరిచయం, ఇత్యాది విషయాలు తెలుసుకోవాలని చాలామందికి ఉంటుంది.**
**ఇది సహజం.**
**మెహెర్‌బాబా సంచిక పాఠకులందరికీ ప్రత్యేకంగా,**
**ఆ మహనీయునికి అక్షరనీరాజనంగా ఆ వివరాలను క్లుప్తంగా అందజేస్తున్నాం.**
**దయచేసి పరిశీలించండి.**
**అనుక్షణం బాబాతో గల తన అనుభవాలను వల్లెవేస్తూ ఎన్నో కబుర్లు అలుపెరుగక చెప్పే భావూజీ చిరస్మరణీయుడు.**

*** * * * * ***

అది 1952 డిశెంబరు నెల.
డిశెంబరు 24న మెహెర్‌బాబా నాగపూర్‌లో పర్యటన ఖరారైంది.
అంతక్రితం అంటే డిసెంబర్ 21 నుంచి 23 దాకా నాగపూర్‌కు సుమారు 60 కిలోమీటర్ల దూరంలోని అమరోతి, విదర్భ విశ్వవిద్యాలయం తదితర ప్రాంతాల్లో పలు ప్రజాదర్శన కార్యక్రమాల్లో బాబా పాల్గొన్నారు.
ఆ దరిమిలా, డిసెంబరు 24 నుండి నాగపూర్, సోనెర్ తదితర పట్టణాల్లో మెహెర్‌బాబా పర్యటన ఉంది. కానీ, డిశెంబరు 24, ఆ తర్వాత ఏర్పాటు చేసిన కార్యక్రమాలన్నీ బాబా స్వయంగా రద్దు చేసేసారు.
నాగపూర్ పర్యటనలో భాగంగా మెహెర్‌బాబా తన వలలో ఒక చేప పిల్లను చేజిక్కించు కోవాలనుకున్నారు.
కానీ, ఆ చేప పిల్ల ఆ సమయంలో నాగపూర్‌లో లేదని తెలుసుకున్నారు.
అందుకే, తన పర్యటనని కూడా

బాబా వాయిదా వేసుకున్నారని బాబా ప్రేమికులు
చమత్కరిస్తారు. **ఇంతకీ ఏమా చేప ?- ఎవరా చేప పిల్ల?**
అదెవరో కాదు, వీర్‌సింగ్ కల్చూరీ.
అతడినే మెహెర్‌బాబా భావూ కల్చూరీ అని పిలిచేవారు.
**హిందీలో 'భావూ'** అంటే సోదరుడని అర్థం.
ఆ పేరుకు తగ్గట్టుగానే బాబా ప్రేమికులందరికీ కడ దాకా అండగా నిలిచాడాయన.
భావూజీ 1926లో నాగపూర్‌లో జన్మించారు.
26 సంవత్సరాల వయస్సులో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్స్‌లో ఎం. ఏ., చేస్తూ-
'లా' డిగ్రీ కూడా ఏకకాలంలో చేశారు.
అప్పటికే ఎం.ఏ., రసాయన శాస్త్రంలో (కెమిస్ట్రీ) పూర్తయి,
రీసెర్చి చేస్తున్నారు.
ఆయనకు చిన్ననాటి నుండీ దైవ భక్తి మెండు.
స్నేహితులు 'పండిట్‌జీ' అనేవారు.
మెహెర్‌బాబా నాగపూర్ పర్యటన చేపట్టేనాటి కంటే ఓ రెండు నెలలు ముందుగానే,
ఆయనకు చదువు పట్ల శ్రద్ధ తగ్గింది.
ఏదో తెలియని నిస్సత్తువ, నిలకడ లేని మనస్సుతో ఇబ్బందిగా ఉంటుంది.
మనస్సు కుదటపడటం కోసం వార్ధాలోని మహాత్మా గాంధీ ఆశ్రమానికి వెళ్ళాడు.
ఐనా లాభం లేకపోవడంతో,
తిరిగి రామకృష్ణ పరమహంస ఆశ్రమానికి వెళ్ళినా,
తాను పోగొట్టుకున్న శాంతి లభించదు.
చివరకు, హిమాలయాలకెళ్ళాలని నిశ్చయించుకున్నాడు.
రిషీకేష్‌లో ఉన్న ఒక స్వామీజీకి ఉత్తరం కూడా వ్రాశాడు.
ఆ స్వామీజీ రిషీకేష్‌కి 1953 జనవరి 9న రమ్మనమని జవాబిచ్చాడు.
ఈ లోగా సంసారబంధనాల నుండి విముక్తి పొందాలనుకున్నాడు.
అప్పటికే భావూకి పెళ్ళయింది.
భార్య, ఏడాది లోపు వయస్సు గల కుమార్తె ఉన్నారు.
తన భార్య, కుమార్తెల బాగోగులు అప్పజెప్పడానికి స్వగ్రామానికి వెళ్ళి
డిసెంబర్ 30న నాగపూర్ తిరిగి వచ్చాడు.

## అనుకున్నదొకటి....

1952 డిసెంబర్, 31న సోనెర్‌లో మెహెర్‌బాబా ప్రజాదర్శనం ఇస్తున్నారని స్థానిక దిన పత్రికల ద్వారా తెలుస్తుంది.
ఆధ్యాత్మిక చింతనలో వున్న భావూ మెహెర్‌బాబాను

తప్పక దర్శించుకోవాలని నిశ్చయించుకున్నాడు.
భావూజీ అక్క గారు, పలువురు పలుకుబడి గల బంధువులు
సోనెర్‌లో ఉన్నారు. ఈ గ్రామం నాగపూర్ నుండి 26 మైళ్ళు దూరంలో ఉంది.

**బాబా దర్శనం**

మెహెర్‌బాబా రాకతో సోనెర్ గ్రామాన్ని బ్రహ్మాండంగా అలంకరించారు.
భావూజీ సోనెర్ రైల్వే స్టేషన్‌లో రైలు దిగుతూనే తమ బంధువుల ఇళ్ళకు
వెళ్ళకుండా తన భార్య, కూతురుతో కలిసి బాబా దర్శనం ఇస్తున్న వేదిక
దగ్గరికి నేరుగా వెళ్ళాడు.
అక్కడ పెద్ద క్యూ ఉంది. అందరితో పాటు భావూ కూడా క్యూలో నిలుచున్నాడు.
మెహెర్‌బాబాను సోనెర్ గ్రామానికి ఆహ్వానించిన వారిలో భావూ బంధువుల పాత్ర
కూడా ప్రధానమైంది. భావూకి క్యూలో నిలుచోవల్సిన పన్లేదు.
నేరుగా బాబా దర్శనం చేసుకునే అవకాశం వుంది.
ఇదే విషయాన్ని ఆయన బంధువులు చెప్పారు.
ఐనా, భావూ క్యూలో నిలుచుని దర్శనం చేసుకోవడానికి ప్రాధాన్యత ఇచ్చాడు.
తొలి దర్శనంలోనే మెహెర్‌బాబా దివ్యమంగళ రూపం భావూని కట్టడి చేసింది.
అది అనిర్వచనీయమైన ఆనంద సమయం.
ఆ దర్శన సమయంలో బాబా కొందర్ని ముద్దాడారు.
కొందరి తలపై నిమురుతూ ఆశీర్వదించారు.
బాబా కొందరికి తన చిరునవ్వు అందించారు.
క్యూలో భావూ వంతు వచ్చింది.
సరిగ్గా ఆ సమయంలో బాబా ఏదో పనిమీద ప్రక్కకు తిరిగి,
భావూ చేతిలో తన ప్రసాదంగా అరటి పండు పెట్టారు.
భావూకేసి క్రీగంట కూడా చూడలేదు.
వెనక పెద్ద క్యూ ఉంది. ఇక పదండి– పదండి – అంటూ
భావూని ప్రక్కకు యథాలాపంగా లాగేశారు.
బాబా ఎదుట కొన్ని క్షణాలు కూడా ఉన్నట్లు లేదు.
బాబా ఎంతటి చతురుడో చూడండి.
ఎంతో వేదన, ఆవేదన, మనస్సు స్థిమితం లేక,
ఎంతో భక్తితో ఆయన దర్శనార్థం వస్తే
కనీసం లిప్త కాలం ఆతనిపై బాబా దృష్టి పెట్టలేదు.
భావూ హృదయ వేదన వర్ణనాతీతం.
కొన్ని క్షణాలు బాబాతో మాట్లాడాలని ఉవ్విళ్ళూరాడు.

కానీ సాధ్యం కాదని కరాఖండిగా చెప్పారు నిర్వాహకులు.
భావూ తాను తిన్న ప్రసాదం..
అరటి పండు గురించి చెబుతూ...
**"అది కేవలం అరటిపండు కాదు.**
**దివ్యప్రేమను వెలిగించిన నిప్పు రవ్వ.**
**అరటిపండు తిన్నప్పట్నించి**
**శరీరమంతా భగ భగమని మండటం మొదలయింది."**
అని భావూ ఓ కవితగా వర్ణించారు.
మెహెర్‌బాబాను కలిసి తన మనస్సులోని బాధను చెప్పుకోవాలని భావూ ఉవ్విళ్ళూరాడు. కానీ అది అసాధ్యం అని స్పష్టంగా చెప్పారు.
ఆ సమయంలో సానెర్ ఏలూరు నుండి వచ్చిన తెలుగు బాబా ప్రేమికులు శ్రీ రంగారావు, డా॥ కనకదండి సూర్యనారాయణలతో భావూజీకి పరిచయమైంది.
మెహెర్‌బాబా త్వరలో ఏలూరు ప్రజాదర్శనానికి వస్తున్నారు.
ఆ సమయంలో తాను అక్కడ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇప్పిస్తానని శ్రీ రంగారావు భావూకి హామీ ఇచ్చారు.
ఐతే, బాబాని ఎలాగైనా సరే కలవాలని, ఆయనతో కొన్ని నిముషాలైనా మాట్లాడాలని భావూ అనేక ప్రయత్నాలు చేశాడు.
ఆ రోజు సాయంత్రం దాకా బాబా ప్రజా దర్శనం ఇచ్చారు.
ఆ తర్వాత స్థానిక సర్క్యూట్ హౌస్‌కి వెళ్ళారు.
అక్కడికి కొత్త వాళ్ళనెవ్వరినీ అనుమతించ లేదు.
రాత్రి బాగా చీకటిపడే దాకా ఆ అతిథి గృహం చుట్టూతా తిరుగాడాడు.
తాను ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న గురువు లభించాడని,
ఇకపై రిషీకేష్‌కి వెళ్ళడం అవసరం లేదని భావూ తృప్తి చెందాడు.
బాగా పొద్దుపోయాక తన అక్క గారి ఇంటికి భావూ వెళ్ళాడు.
ఉదయం కనపడిన భావూ ఎక్కడకెళ్ళాడా? అని ఆమె ఎదురు చూస్తోంది.
వారెవరితోనూ తన మనస్సులోని బాధ భావూ చెప్పలేదు.
ఆ రాత్రి నిద్ర పోలేదు.
భావూజీని గమనిస్తున్న ఆయన బావ గారు ఏమైంది? అదోలా ఉన్నావని అడిగాడు.
భావూజీకి తెలియదు కానీ,
భావూజీ బావ గారు, వారి బంధువులు చాలామంది
1944లోనే మెహెర్‌బాబాను దర్శించుకున్నారు.
మెహెర్‌బాబాను దర్శించుకున్నప్పట్నుంచి ఆయన హృదయం దివ్యప్రేమతో

భగ భగలాడుతోంది.
ప్రభుత్వ అతిథి గృహానికి భావూ తిరిగి వెళ్ళాడు.
తెలుగువారు శ్రీ రంగారావు, డా॥ కనకదండి అక్కడే వున్నారు.
రంగారావు గారి అబ్బాయి అంతక్రితం రోజున బాబా వేసుకున్న పూలదండ కావాలంటే వారక్కడకు వచ్చినట్లు తెలిసింది.
ఇదీ బాగుందనుకుని, తనకూ ఓ పూలదండ ఇప్పించమని ఒక చిన్న కాగితంగా సిఫారసు లేఖ రంగారావు గారి చేత భావు రాయించు కున్నాడు.
అలా ఒకసారి గెస్ట్‌హౌస్‌లోకి వెళ్ళి,
వీలైతే బాబాను దర్శించుకోవచ్చన్నది భావూ ఆలోచన.
ఈ ఉపాయమూ సక్సస్ కాలేదు.
బాబా ప్రేమికుడొకరు భావూనీ బయటనే ఉంచి,
అతనే లోనికి వెళ్ళి పూలదండ ఒకటి తీసుకొచ్చి భావూకిచ్చాడు.
భావూ అనుకున్నట్లు పూలదండ దొరికింది కానీ,
బాబా దర్శనం దొరక లేదు.

**రెండవ రోజు బాబా దర్శనం**

ఆ తర్వాత భావూ బాబా దాస్‌ను కలిసాడు.
బాబా ఆజ్ఞ మేరకు బాబాదాస్ మౌనంలో ఉన్నాడు.
బాబా మండలి సభ్యులందరూ ఏదో పనిమీద బిజీగా ఉన్నారు.
ఆ మర్నాడు కూడా బాబా అక్కడ దర్శనం ఇచ్చారు.
సుమారు 20 వేల మంది స్థానిక ప్రజలు బాబాను దర్శించుకున్నారు.
తిరిగి, భావూ క్యూలో నిల్చుని బాబాను దర్శించుకున్నాడు.
ఈ దఫా కూడా సరిగ్గా భావూ వంతు వచ్చేసరికి
బాబా ఆయనకేసి చూడలేదు.
ఆ తర్వాత బాబా స్థానిక ప్రేమికుల ఇళ్ళకు వెళ్ళారు.
భజనలు- కవ్వాలీలు పాడారు.
ఆ మర్నాడు జనవరి 2, 1953 నాగపూర్‌లో దర్శనం కార్యక్రమం ఉంది.
ఇదిలాఉండగా,
**" నన్ను భగవంతునిగా ఆరాధించే వ్యక్తిని ఇంకా నేను కల్సుకోలేదు.**
**అతని కోసం నేను వేచిఉన్నానని"** నర్మగర్భంగా బాబా తన మండలివారితో అన్నారు.
భావూజీ అనుభవిస్తున్న బాధ వర్ణనాతీతం.
బాబాను ఎలాగైనా కలవాలని తహతహలాడుతున్నాడు.
బాబా బస చేసిన బంగళాకెళ్ళాడు.

మండలివారందరూ అక్కడ్నుంచి నాగపూర్‌కు వెళ్ళేందుకు హడావిడిగా ఉన్నారు.
భావూ బాబాను అనుసరిస్తూనే ఉన్నాడు.
అయితే నాగపూర్‌లో బాబా ఎక్కడ దర్శనం ఇస్తున్నారో, ఆయన బస ఎక్కడో తెలియదు.
బాబా కార్యక్రమం నాగపూర్‌లో ఎక్కడ ఏర్పాటు చేశారని కలిసిన
వాళ్ళందరితో వాకబు చేసాడు.
సరైన సమాచారం ఏ మాత్రం దొరకలేదు.
నాగపూర్‌కు చేరుకుని బాబా బస తెలుసుకునేందుకు చాలా ప్రయత్నం చేశాడు.
ఆ రోజు ఆదివారం. జనవరి 4వ తేది.
అప్పటికే బాబా నాగపూర్ వచ్చి రెండ్రోజులు అయింది.
పలుచోట్ల బాబా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
కానీ భావూకి మాత్రం ఇసుమంత సమాచారం ఉండదు.
ఇదిలా ఉండగా జనవరి 4, స్థానిక దినపత్రిక నాగపూర్ టైమ్స్‌లో స్థానిక
గీతా మందిరంలో బాబా దర్శన కార్యక్రమాలు గురించి వివరిస్తూ
ఒక చిన్న వార్త ప్రచురించారు.
ఆ వార్తా క్లిప్పింగ్ ద్వారా భావూ వెంటనే అక్కడకు చేరుకున్నారు.
ఆ సమయంలో అదృష్టవశాత్తూ...బాబా దర్శనం ఇస్తున్నారు.
భావూజీ కూడా క్యూలో నిల్చున్నాడు.
బాబా దర్శనం లభిస్తుంది కానీ,
అవతారునితో కొన్ని క్షణాలైనా మాట్లాడాలన్న కోరిక నెరవేరలేదు.
ఇందుకోసం భావూ శతవిధాలా తన ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నాడు.

**విభూతి**

ఈ సమయంలో బాబా ప్రేమికుడు 'విభూతి'తో పరిచయమయింది.
ఈతను బాబా నామ వ్యాప్తికి ఎంతో కృషి చేశాడు.
చివరకు ఈ 'విభూతి' భావూ గురించి బాబాకు తెలియజేశాడు.
స్థానిక **వర్మా బంగళాకు** మధ్యాహ్నం వచ్చి కలవమని బాబా విభూతి ద్వారా
కబురు పంపారు. బాబా బస ఎక్కడన్నది భావూకి అప్పుడు తెలుస్తుంది.
అవతారునితో మనస్సు విప్పి మాట్లాడుకునే అవకాశం
ఎన్నో రోజుల నిరీక్షణ తర్వాత లభించింది.
బాబా ఆదేశాల ప్రకారం ఆయన బస చేసిన బంగళాకు వెళ్ళాడు.
ఆ సమయంలో కవ్వాలీ కార్యక్రమం జరుగుతోంది.
**బాబా భావూని చూసి, పలకరింపుగా**

**ఏం చేస్తున్నావ్? అన్నారు.**
**ఫైనల్ ఇయర్ మాస్టర్స్ డిగ్రీకి సిద్ధమౌతున్నానని చెప్పాడు.**
**నీకేం కావాలి? అని తిరిగి బాబా ప్రశ్నించారు.**
**మీతో ఉండాలని కోరుకుంటున్నానని అన్నాడు భావూ.**
**నీకు పెళ్ళి అయ్యిందా? అని అడిగారు.**
**పెళ్ళయిందన్నాడు.**
**నీ భార్య పేరేమిటి అని అడిగారు.**
**రమ**
**పిల్లలున్నారా?**
**షీలా- ఒక ఆడపిల్ల.**
**నా ఆదేశాలు విధేయతతో పాటించగలవా?**
**అందుకు సిద్ధమయ్యే వచ్చానన్నాడు.**
**పంక్‌రాజ్ అనే ప్రేమికుడు మధ్యలో కల్గజేసుకుంటూ,**
**"బాబా - విధేయత అంటే ఏమిటో అతనికి కాస్త వివరంగా చెప్పండి" అన్నాడు.**
**బాబా ఆతని మాటలు లెక్కచేయనట్లు-**
**నీ కంటే ఆతనికి బాగా తెలుసు.**
**అతను ఎం.ఎస్‌సి. చేస్తున్నాడు అన్నారు.**
**ఒంటి మీద నూలు పోగు లేకుండా భిక్షాటనకు వెళ్ళమని ఆదేశిస్తే వెళ్ళగలవా? అని బాబా తిరిగి భావూను ప్రశ్నించారు.**
**సిద్ధం - బాబా అని వినమ్రంగా జవాబిచ్చాడు.**
**అన్నీ వదిలి నా దగ్గర ఉండటానికి నీవు సిద్ధమేనా?**
**తప్పకుండా రాగలను - అదే నేను కోరుకునేది, అని భావూ అన్నాడు.**
**నీ పరీక్షలు ఎప్పుడు?**
**మార్చి నెలలో..**
**పరీక్షలు వ్రాసి, ఆ తర్వాత నేను ఎక్కడ ఉన్నానో తెలుసుకుని**
**అక్కడకు రమ్మనమని భావూకి బాబా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.**
**భావూకయితే అదే రోజున బాబాతో ఉండిపోవాలని ఉంది.**
మీరు ఆంధ్రా పర్యటనలో ఉన్నప్పుడు రావచ్చా? అని తిరిగి భావూ బాబాతో అన్నాడు.
నా పర్యటన రోజులు నీ పరీక్ష తేదీలకు అడ్డురాకపోతే తప్పక రమ్మన్నారు.
పరీక్షలయిపోగానే బాబాతో ఉండిపోవడానికి
స్థిరంగా ఉండిపోవాలని భావూ నిశ్చయించుకున్నాడు.
భావూతో పాటు భార్య రమ, కుమార్తె షీలా బాబాను దర్శించుకున్నారు.

అప్పుడు ఆమె వయస్సు 20 సంవత్సరాలు.
తన భర్త మనస్తత్వం బాగా తెలుసు కాబట్టి ఆతని నిర్ణయానికి
ఆమె ఏమాత్రం  అడ్డురాలేదు.
భావూ తన మాస్టర్స్ డిగ్రీ పరీక్షలు వ్రాశాడు.
బాబా ఆజ్ఞ ప్రకారం, బాబా అప్పుడు డెహ్రాడూన్‌లో ఉంటే,
నాగపూర్ నుంచి డా॥ సి.డి.దేశ్‌ముఖ్‌తో కల్సి బాబా దగ్గరికి వెళ్ళాడు.
నీవింకా నీ పాత మాటలకు కట్టుబడి నా దగ్గర స్థిరపడటానికే సిద్ధంగా వున్నావా?
అని బాబా ప్రశ్నించారు. సిద్ధంగా ఉన్నాను. అందుకే ఇక్కడకు వచ్చానని
భావూ వినమ్రంగా జవాబిచ్చాడు.

## వేలకు వేలు చేపలుంటాయి

దాంతో బాబా- నాకు చాలా సంతోషంగా ఉందన్నారు.
దర్శన కార్యక్రమాలలో ఎందరో వస్తుంటారు.
నీళ్ళలో ఎన్నో వేలకు వేలు చేపలుంటాయి.
కానీ గాలానికి ఏ ఒక్కటో చిక్కుతుందని' బాబా చమత్కరించారు.
ఆ మర్నాడు, భావూని పిలిచి అన్నింటికీ సిద్ధంగా ఉన్నావా? అని బాబా అడిగారు.
అవునని వినమ్రంగా భావూ సమాధానమిచ్చాడు.
**“ నేను నిన్ను ముంబాయి లేదా దేశంలో మరెక్కడికైనా వెళ్ళి, కుష్టురోగులకు నా తరపున సేవచేయమని ఆదేశించవచ్చు.**
**వేరే ఎక్కడికైనా వెళ్ళి ఉపన్యసించమనొచ్చు.**
**లేదా హిమాలయాలలోని బదరినాథ్‌కు వెళ్ళి భిక్షాటన చేయమంటాను.**
**లేదంటే రిక్షా తొక్కి, డబ్బు గడించి నాకివ్వమని ఆదేశిస్తాను.”**
క్లుప్తంగా చెప్పాలంటే, నేను ఏది చెప్తే అది నిర్వర్తించాలి.
కొన్ని నెలలు పోయాక వెళ్ళి నీ కుటుంబంతో ఉండిపొమ్మంటాను.
లేదా ఏదైనా వ్యాపారం చేయమంటాను.
లేదంటే ప్రాపంచిక విషయాలకు సంబంధించిన పని ఏదైనా అప్పగిస్తాను.
అంటే ఏమిటంటే, నేను ఏది ఆజ్ఞాపిస్తే,
నీవు ఆ పని చేయాల్సి ఉంటుంది.
నేను చెప్పిన పనులు నీకు ఇష్టమా? అయిష్టమా? అనే ప్రశ్న ఉండదు.
నీవు తు.చ. తప్పక పాటించాల్సి ఉంటుంది.
నీవు ఇష్టపూర్వకంగా ఆ పని చేయగల్గితే, నీవు ఏ పని చేసినా అది నాకు చెందుతుంది.
అది మంచిది కావచ్చు లేదా చెడు పని కావచ్చు.

ఆ పనిని నా కోసం నీవు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు బాబా.
'నా ఆజ్ఞ ప్రకారం నీవు ఏ పని చేసినా,
అందుకు పూర్తి బాధ్యత నాదే.
ప్రేమతో నా ఆజ్ఞని నూటికి నూరు శాతం అమలు పరిచితే
నీకు ఎలాంటి బాధ్యత ఉండదు.
నా ఆదేశాల అమలులో నీ మనస్సును ప్రవేశపెడితే,
పెద్ద అయోమయం తలెత్తుతుంది.
మనస్సు చాలా ఛిద్రమైంది. విచిత్రమైంది.
మనస్సు పెట్టడం వల్ల విధేయత సాధ్యపడదు.
నూరు శాతం విధేయత ప్రతి విషయంలో చూపాలన్నారు.
ఆ తర్వాత విధేయత గురించి బాబా రెండు చిన్న కథలు చెప్పారు.
ఉపాసనీ మహారాజ్ ఆశ్రమంలో **తారామెక్** అనే శిష్యుడు ఉండేవాడన్నారు.
అతను ఆశ్రమ వ్యవహారాలన్నీ చక్కబెడుతుండేవాడు.
దుర్గాబాయ్ కర్మాకర్ అనే మరో మహిళ ఉండేది.
ఆమె అలాంటి విషయాలు పట్టించుకునేదేమీ కాదు.
వీరిద్దరూ ఒక రోజున వాగ్వివాదానికి దిగారు.
మీ ఇద్దరికీ డబ్బు మీద ప్రేమ పెరిగింది కాబట్టి,
తక్షణం ఆశ్రమం వదిలి పొమ్మనమని మహారాజ్ ఆదేశించారు.
ఆశ్రమంలో మరో వ్యక్తి మహదేవ్ అనేవాడు ఉండేవాడు.
వృత్తి రీత్యా అతడు వ్యవసాయదారుడు.
అతనికి మహారాజ్‌ను ప్రేమించడం మినహా మరే పనికి హాజరయ్యేవాడు కాదు.
ఒకరోజున ఆశ్రమంలో ఈ విషయం పెద్ద చర్చకు వచ్చింది.
అదేమంటే తారామెక్ ఎన్నో విషయాలు చక్కబెడతాడు.
మహదేవ్ మాత్రం తిని కూర్చుంటాడు.
ఏ పని చేయడని నిష్ఠూరంగా ఆతడ్ని ఆరోపించారు.
మహారాజ్ జోక్యం చేసుకుంటూ కొన్ని సంవత్సరాలుగా
ఏ పని చేయకుండా ఉండటమంటే ఎంతో గొప్ప పనిని నిర్వర్తించినట్లన్నారు.
ఏళ్ళ తరబడి ఏ పని చేయకపోవడమంటే
అదొక తపస్సులాంటిది అని మహారాజ్ స్పష్టం చేశారు.
ఈ విషయమై బాబా ప్రసంగిస్తూ, జవహార్‌లాల్ నెహ్రూ, చర్చిల్
ఇద్దరూ రెండు పెద్ద దేశాల బరువు బాధ్యతలు మోస్తున్నారు.
అయితే 'నీలకంఠ' అనే మస్తు మాత్రం ఏ పని చేయకుండా,

నిరంతరం తన కుక్కి మంచంలో పడుకునే ఉంటాడు.
అయితే నీలకంఠం, నెహ్రూ కంటే ఎంతో ఘనమైన పనిని
నిర్వహిస్తున్నాడన్నారు బాబా.
ఏ పని చేయకపోవడం అంటే ఏమిటి?
తినడం అంటే పనిచేయడమే. ఉపవాసం ఉండడం కూడా పనిచేయడమే.
నిద్రపోవడం, మెలుకువగా ఉండడం,
అన్నీ ఏదో ఒక పని చేయడమే అవుతుంది.
అయితే, ఏ పనినైతే అప్పజెప్తుతారో, అప్పజెప్పిన వారి ఇచ్ఛ ప్రకారం
అది తు.చ. తప్పక నిర్వర్తిస్తే దాని బాధ్యత ఆయా వ్యక్తులకు ఏమీ
ఉండదు అని బాబా అన్నారు.
ఆ తర్వాత 'కోరికలు గురించి బాబా ప్రస్తావించారు.
చివరిగా బాబా భావూని ఉద్దేశించి **'Now you will live for me'**
అని ఆజ్ఞాపించారు.
ముందుగా భావూజీని కనీసం 19 రోజులు ఉండాలని పిలిపించినా,
మూడ్రోజుల తర్వాత ఇంటికి వెళ్ళి రమ్మనమన్నారు.
"నాగపూర్ తిరిగి వెళ్ళు. నెల రోజులపాటు పూర్తి విశ్రాంతి తీసుకుని
డెహ్రాడూన్ రమ్మనమన్నారు. ఒకసారి వచ్చాక- నీ సంగతి నేను
చూసుకుంటా"? అన్నట్లు నెల రోజులు సెలవిచ్చి,
స్వగ్రామం వెళ్ళి రమ్మన్నారు.
నిన్ను ఇంటికి పంపుతున్నాననుకోకు. నీ వెంట, ప్రతి క్షణం నేను నీ తోడుగా
ఉంటాను. మర్చిపోవద్దని ఆదేశిస్తూ, భావూకి తాత్కాలికంగా
నెలరోజుల సెలవిచ్చి పంపారు. ఆ మాదిరిగా బాబా వలలో చిక్కిన భావూ,
బాబా సేవలకే జీవిత చరమాంకం వరకూ అంకితమయ్యారు.

*

# కోరి గోపాలపురం బాబా సెంటర్

అవతార్ మెహెర్‌బాబా కోరి గోపాలపురం సెంటర్ నుందు బాబా ప్రేమికులు 29.10.2013 నుండి బాబా జన్మదిన కార్యక్రమములు మొదలుపెట్టితిమని, 29.10.2013 నుండి 25.02.2014 వరకు ప్రతిరోజూ సాయంత్రం బాబా సెంటర్ నందు 7 గం.ల నుండి 8 గం.ల వరకు సంకీర్తనలు చేయుచున్నామని, సెక్రటరీ శ్రీ కమ్మ మాణిక్యాలరావు (73826 83267) ఒక ప్రకటనలో తెలిపారు.

# భావూతో ఫోటో



ఈ ఫోటోల్లో భావూజీతో మహేశ్వరరావు దంపతులు, అలాగే, దశిక మెహెర్, నిర్మలా దేవిలను చూడొచ్చు. భావూతో ఫోటో తీయించుకోలేదన్న బాబా ప్రేమికులు ఎవరున్నారో? ఒక్కరి పేరు చెప్పండి. ఆయన ఆలింగన భాగ్యం పొందనివారూ ఈ తరంలో ఎవరూ ఉండి ఉండరు. అసాధారణ ప్రతిభ గల అసమాన్యుడు భావూ. హిమాలయ సానువుల్లో దీక్షలో ఉండే రుషి పుంగవులతో సమానం బాబా మండలి సభ్యులు. ఆ కోవలో భావూజీ కడపటివాడని బాబా ప్రేమికుల నమ్మకం.



# మూగబోయిన తెలుగువారి రెస్ట్ హౌసు



ఆంధ్రా రెస్టు హౌసు మూగబోయింది. ఈ హౌసు వ్యవస్థాపకుడు వైయస్ రావు ఆకస్మికంగా నిష్క్రమించడంతో ఈ సంచికలో ఆంధ్రా రెస్టు హౌసుకు సంబంధించిన సమాచారం ఇచ్చేవారు కరవయ్యారు. ప్రతినెలా 25వ తేదీకే రెస్టు హౌసుకు గురించి పత్రికా ప్రకటనలు పంపేవాడాయన. ఆ తర్వాత పంపిన పోస్టు అందిందా అని ఫోన్లో వాకబు చేశేవాడు. పత్రికలో ప్రచురించి బాబా సేవ చేసుకోండని గుర్తుచేసే వైయస్ రావు ఇకలేడనుకోవడమే చాలా బాధాకరంగా ఉంది. మెహెరాబాద్‌లో అమరతిథికి, మౌన వార్షికోత్సవానికి విచ్చేసే బాబా ప్రేమికుల కోసం బాబా ట్రస్టువారితో సమానంగా అన్నట్లు ఎన్నో ఏర్పాట్లు చేసేవాడు. ఎవరెవరికి ఎక్కడ ఏ గది కేటాయించారో తెలియజేస్తూ ముందుగానే లేఖలు రాసేవాడు. ప్రస్తుతం రెస్టుహౌసు గవర్నింగ్ బాడీ రావు గారి లాంటి మరో వ్యక్తి కోసం అన్వేషణలో ఉందని తెలిసింది. అమరతిథి మూడ్రోజుల్లో ఆఖరి వ్యక్తి రైలు కెళ్ళేదాకా ఇంటి ముఖం చూడకుండా, తన గురించి, తన వాళ్ళ గురించి ఆలోచించకుండా శ్రమించిన రావు గారి లాంటి మరో వ్యక్తికి ఆంధ్రా రెస్టు హౌసు బాధ్యతలు అప్పగించాలని ప్రయత్నిస్తున్నారు. ఎవరు ఆ బాధ్యతలు చేపట్టినా యాతం వారిని మురిపింపజేయాలనుకోవడం ముదావహం.

# మెహెర్‌బాబా పత్రిక

ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఐతే ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ వి. ఆర్. కె. శాస్త్రి, (98492-42284), లేదా శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు.

**మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను ఇంటర్‌నెట్‌లో పంపగలం.**

**మెహెర్‌బాబా జన్మదినోత్సవాలు ప్రారంభమౌతున్న దృష్ట్యా మెహెర్‌నామం అధిక పాఠకులకు అందజేసేందుకు వీలుగా మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రికకు వార్షిక, జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి.**

**పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు.**

# యాప్రాల్‌లో ఏకాహం

## 09-2-2014 ఆదివారం ఉ.5 నుండి సా.5 దాకా.

ఫిబ్రవరి 09, ఆదివారం ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ ప్లాట్ నెం.32, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, సికింద్రాబాద్ -500 087, (ఫోన్- 99595-53218) అవతారుని ఏకాహం ఏర్పాటు చేయడమైంది. బాబా ప్రేమికులందరూ వీలుచూసుకుని ఈ ఏకనామంలో పాల్గొనవల్సిందిగా శ్రీ మల్లాది కృష్ణానంద్ కోరుతున్నారు.

యాప్రాల్ చేరుటకు సికింద్రాబాద్‌లో వున్న పాస్‌పోర్టు ఆఫీసు నుండి సిటీ బస్సు నంబరు 24, 24బి (యాప్రాల్‌లోని వాటర్ ట్యాంక్ స్టేజి, ఆంధ్రా బ్యాంక్ ఎదుట) ప్రతి ఐదు నిముషాలకు వుంది. కాగా సొంత వాహనాలలో వచ్చువారు తిరుమలగిరి జంక్షన్ నుంచి యాప్రాల్ వాటర్ ట్యాంక్ స్టేజి, ఆంధ్రా బ్యాంక్ దగ్గర నుండి అర్ధ కిలోమీటరు దూరంలో గోదావరి గార్డెన్సు, ప్లాట్ నంబరు 32 కలదు.

**ఏకనామంలో కొన్ని క్షణాలైనా పాల్గొనాలనుకోవడం అవతారుడు కల్పించిన ఒక మహత్తర అవకాశంగా భావించాలని, వీలుచూసుకుని బాబా ప్రేమికులందరూ హాజరుకావల్సిందిగా శ్రీ మల్లాది కోరుతున్నారు.**

# మెహెరాస్తానా 12వ వార్షికోత్సవము

## 01.12.2013 ఆదివారం ఉదయం 6 గంటల నుండి

బాబా తన రెండవ ఆంధ్రా పర్యటనలో 26.02.1954 పశ్చిమ గోదావరి జిల్లా, ఉంగుటూరు మండం,రామచంద్రపురం గ్రామంలో నున్న బాలగోపాల సోదరుల స్వగృహమునకు విచ్చేసినారు, బాబా పాదస్పర్శచేత పునీతమైన స్థలము నేడు **"మెహెరాస్తానా ఆధ్యాత్మిక కేంద్రము"గా వెలసిల్లుతున్నది.** మెహెరాస్తానా 12వ వార్షికోత్సవము 01.12.2013 ఆదివారం ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు బాలగోపాల మెహెర్ ప్రభు ఆహ్వానం పంపినారు.

ఈ కార్యక్రమానికి బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా బాలగోపాల మెహెర్‌ప్రభు కోరుతున్నారు. మరిన్ని వివరాలకు ఆయన్ని ఫోన్ 80962 69887, 95424 29124, 08818-271773 సంప్రదించవల్సిందిగా కోరుతున్నారు.

*



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చురీ, లార్డ్ మెహెర్,**
**వాల్యూం-4 (1929 మే నుండి) - తెలుగుసేత: మల్లాది రామారావ్,**
**న్యూఢిల్లీ**

***(గత సంచిక తరువాయి)***

ధులియాలో వున్న రెండు-మూడు రోజుల్లో మండలివారికి ఓ వింత అనుభవం ఎదురయింది.
వీళ్ళున్న గది ప్రక్కనే ఓ పూజారి వుండేవాడు.
అతగాడు రోజూ తెల్లవారుఝామున లేవటం, వేదమంత్రోచ్చారణ చేయటం చేసేవాడు.
అది అతని అలవాటు.
మండలివారు వచ్చారని చేస్తున్నపని కాదు కానీ, అతని వేదమంత్ర ఘోష మన మండలివారి నిద్ర చెడగొట్టేది. లేచి కూర్చొనేవారు.
ఒక్కసారి లేచాక మళ్ళా పడుకోవటం కష్టం కదా.
ఆ పండితులవారి మంత్రాలు పూర్తి అయ్యేకనే, వీళ్ళు మళ్ళా నడుం వాల్చేది.
ఇంతలో భళ్ళున తెల్లవారేది.
ఇహ లాభం లేదని మంచం దిగక తప్పేది కాదు.
ఈమాటే బాబావారితో చెప్పారు.
మాకు భలే ఇబ్బందిగా వుంది బాబా అని అన్నారు.
బాబావారికి వీళ్ళ కష్టం తెలియకపోతే కదా.
ఆ కష్టం పేరు చెప్పి ఓ ధర్మసూత్రం వివరించారు.
పూజ పేరు చెప్పి ప్రార్ధనలు చేయటం, ఇలా ఈ పూజారిలా మంత్రాలని అప్పగిస్తున్నట్లు చదవడం ఓ రివాజు.
ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా ఇలా చేస్తున్నవారు వందలు వేలు కన్పిస్తారు.
అలా ప్రార్ధనలు చేసుకొంటూ పోతే ఏమి ఒరుగుతుంది అంటారా?
ఏమీ ఒరగదు. అదొక దండగ పని అనుకోండి.
ఇంతగట్టిగా గొంతు ఎత్తి మరీ ప్రార్ధన చేస్తున్నాం,
ఇందువల్ల లాభం ఉంటుందా? అన్న ప్రశ్న వేసుకోవాలి.
కానీ ఈ ప్రార్ధనలు చేస్తున్న మహానుభావులకి ఆ ఆలోచనే రాదు.
మనం ఏంచేస్తున్నాం,

ఇందువల్ల ఏమవుతుంది అని ఒక్క క్షణం కూడా బుర్రకి పని చెప్పరు.
ఇది ఈవేళ్టి పద్ధతి కాదు. తరతరాలుగా ఇదే తంతు.
ఎన్ని యుగాలు మారినా ఇంతే. ఈ పద్ధతి మారలేదు.
హిందువుల్లో బ్రాహ్మణులు పూజలు చేస్తారు.
అలానే పార్శీలో దస్తూరులు పూజా విధానం నిర్వహిస్తారు.
మరి మహమ్మదీయుల్లో అయితే ఈ పని, అంటే ప్రార్ధన వగైరా చేసేది మౌలీలు.
ఇలా ప్రతి మతంలో పూజారులున్నారు. వాళ్ళు పూజలు చేస్తున్నారు.
మంత్రాలు వల్లిస్తున్నారు. ఇది అంతా డబ్బుల కోసం చేస్తున్న పని.
వాళ్ళకేమయినా ఒరిగిందా? గొంతు నెప్పి తప్ప.
అందుకనే వాళ్ళని ప్రార్ధన చేస్తున్నారనడం తగదని బాబావారు కొంచెం ఘాటుగానే చెప్పారు.
భక్తి లేని ప్రార్ధన శుద్ధ దండగ అన్నారు.
ఏ ప్రార్ధన చేసినా మనస్ఫూర్తిగా చేయాలి.
మనస్సు పెట్టి శ్రద్ధగా చేయాలి. కానీ మన పూజలో శ్రద్ధ లేదు.
ఏదో మొక్కు బడికి చేసే పూజలు అవి.
అలా పూజ చేస్తే గొంతు నెప్పి పుడుతుంది.
ఓ ప్రక్క పూజ చేస్తుంటారు. మరో ప్రక్క మనస్సు ఎక్కడికెక్కడికో పరుగెడ్తుంది.
ఎన్నో ఆలోచనలు వాళ్ళని క్రమ్మేస్తాయి. పూజపై మనస్సు వుండదు.
నోటి దారి నోటిది, మనస్సు దారి మనస్సుదీ అవుతుంది.
పూజలు ఇలా చేయకూడదు. మనస్సు పెట్టి చేయాలి.
నిర్మలమైన మనస్సుతో దైవారాధన చేయాలి.
శ్రద్ధగా దేముడిని పూజించాలి. ఆరాధించాలి.
ఎంత శ్రద్ధగా పూజ చేయగలిగితే, అంత మంచిది.
అప్పుడే నీ ప్రార్ధన భగవంతునికి వినిపిస్తుంది అని బాబావారు మండలివారికి చెప్పారు.
మీ ప్రక్కింటి పూజారి వేద మంత్రాల ఘోష కేవలం కంఠశోష తప్ప ఇంకేమీ కాదని తేల్చి చెప్పారు.
అటువంటి తప్పుదారి మీరు పట్టకూడదని హెచ్చరించకుండానే ఓ హెచ్చరిక చేశారు.
ఇంకోమాట చెప్పారు. ఆ పూజారి అనుకొంటూ ఉండవచ్చు.
ఈవేళ ఎంత బాగా ప్రార్ధన చేశాను అని.
గుక్క త్రిప్పుకోకుండా నేను చేసిన భగవస్తుతి దేముడికి వినిపించి వుంటుంది.
ఎందుకు వినపడదు. అంత గట్టిగా స్పష్టంగా శ్లోకాలు నేను చదివితే
అనుకొంటూ వుండవచ్చు ఆ పూజారి మహాశయుడు.

మీకోమాట చెప్పనా, నాకు అతగాడి పూజలు వినపడ లేదు.
ఎంతో దగ్గరగా ఉన్నాడు కదా. మీకు వినపడగా లేనిది నాకు ఎందుకు వినపడకూడదు.
అబ్బే! నాకు వినపడలేదు. అతగాడి ఘోష నా చెవిలో పడలేదు.
అతని ప్రార్థనలకి నేను చెవిటివాడినయ్యాను.
నాకు ఎందుకు వినపడలేదో తెలుసా మీకు?
నాకు అటువంటి ప్రార్థనలు గిట్టవు. అవి నన్ను తాకవు.
నన్ను కదల్చవు కూడా మరి.
అదే ఓ మహాపాపి నన్ను స్మరిస్తే కరిగిపోతాను.
ప్రపంచంలో ఎక్కడ వున్నా సరే, ఏవూరు మూలనుంచి అయినా సరే
ఒక్క పాపాత్ముడే కాదు, ఏ కొరగాని వాడు ప్రార్థించినా భగవంతుని చెవిని పడుతుంది.
ఎందుకనీ అది మనస్ఫూర్తిగా చేసిన ప్రార్థన కాబట్టి.
మరి పూజారి ఘోష?
చెప్పానుగా శ్రద్ధలేని ప్రార్థన ఎంత గట్టిగా చేసినా,
ఎక్కడి నుంచి చేసినా ఒక్కటే. నన్ను కానీ, సద్గురువులని కానీ చేరదు.
ప్రార్థన అంటే మనస్సు పెట్టి చేసేది ప్రార్థన.
నిర్మలంగా చేయాలి ప్రార్థన. నిజాయితీగా చేయాలి దైవ ప్రార్థన.
మీరు నాకు ఎంత దగ్గరగా వున్నారు అన్నది ప్రధానంకాదు.
అలానే ఎంత గట్టిగా ప్రార్థించారు.
ఎంత మధురంగా ప్రార్థన పాడారు అన్నదీ ప్రధానం కాదు.
నిజాయితీగా నిర్మలంగా ప్రార్థన చేయాలి.
ఎక్కడి నుంచి చేసినా ఒక్కటే. నెమ్మదిగా చేసినా, వినబడీ వినబనట్లు ప్రార్థన
చేసినా ఒక్కటే. మీ ప్రార్థన నాకు వినిపిస్తుంది.
నాతో సంపర్కం ఏర్పడుతుంది మీకు అన్నారు.
ఓ ఉదాహరణ చెప్పారు. టెలిఫోను ఎక్ఛేంజి సంగతే గమనించండి.
అందరి ఫోనులు ఆ ఎక్ఛేంజీకే చేరుతాయి.
అక్కడి నుంచి ఎక్కడికి వెళ్ళాలో వెడతాయి.
ఈపని క్షణాల్లో జరిగిపోతుంది.
అందుకనే మీరు ఫోను నెంబరు త్రిప్పగానే అవతలి వ్యక్తి హలో అని బదులు ఇస్తాడు.
కుతుబ్ అంతటికీ అన్నింటికీ ప్రధానం.
ఆయనొక టెలిఫోను కేంద్రం. ఆషామాషీ కేంద్రం కాదది. ప్రధాన కేంద్రం.
అంతటికీ అన్నింటికీ మూల కేంద్రం.
అందుకనే ఎవరు మనస్ఫూర్తిగా ఎక్కడ స్మరించినా కుత్‌బ్‌కి వినిపిస్తుంది.

నిజాయితీగా ప్రార్థిస్తే చాలు ఎంతదూరమైనా ఒక్కటే, ఫోను మ్రోగుతుంది.
దగ్గరా, దూరమా అన్న మీమాంస కుతుబ్‌కి వర్తించదు.
ఎందుకు అంటే, సృష్టికి కేంద్రం కుతుబ్ కాబట్టి,
ఎవరు ఎంత దూరంలో వున్నా ఒక్కటే ఒక్క మానవ ప్రపంచానికే కాదు కేంద్రం
కుతుబ్ మూడు లోకాలకీ, వివిధ భూమికలకీ కూడా కుతుబ్ కేంద్రస్థానం.
మీకో ధర్మ సందేహం రావచ్చు.
చరాచర జగత్తులో లక్షలాది, కోట్లాది ప్రాణులున్నాయి కదా.
అందరి ప్రార్థనలనీ ప్రభువు వినగలడా! దీన బాంధవా కాపాడవా అని
ఎందరో ప్రార్థిస్తుంటే అందరికీ ఒక్కసారే చేయుతనీయగలడా!
ఇది సాధ్యమా!
ఇవి మీ ధర్మ సందేహాలు.
సరే ఇంతకీ కుతుబ్ ఎవరనుకొంటున్నారు. కుతుబ్ ఎవరో తెలుసా!
ఈ అనంత సృష్టికీ రారాజు. అనంత శక్తి సంపన్నుడు.
కుతుబ్ దృష్టిలో అందరూ సమానమే.
ఒకరు ప్రార్థించినా, ఇరవైనొక్కమంది ప్రార్థించినా ఒక్కటే కుతుబ్‌కి.
దీనబాంధవా, నా దరికి రావా అని వెయ్యి మంది ప్రార్థించినా,
లక్షమంది ప్రార్థించినా ఒక్కటే. కోటిమంది అయినా పదివేల కోట్ల మంది
అయినా అందరూ కుతుబ్‌కి సమానమే.
అందరి ప్రార్థన, అందరి వేదన ఒక్కటే.
గుండె లోతుల్లోంచి రావాలి ఆ పిలుపు.
ఆ ప్రార్థన. అది చాలు, ఎంత దూరమయినా, ఎంతమంది ప్రార్థిస్తున్నా, ప్రార్థనా
మార్గం ఎంత కిక్కిరిసివున్నా సరే కుతుబ్‌కి పట్టవు అని
చాలా ఓపికగా మండలివారికి చెప్పారు. ఇంకోమాట శెలవిచ్చారు.
అది ఏమిటీ అని అంటారా పాఠకమహాశయా!
ఇప్పటివరకూ చెప్పిన మాటనే మరోసారి మరింత స్పష్టంగా చెప్పారు.
ప్రార్థన కానీ, పూజకానీ మొక్కుబడిగా చేయకూడదన్నారు.
మనస్సుపెట్టి చేయాలి అన్నారు.
శ్రద్ధలేని పూజ, భక్తి లేని ప్రార్థన దండగన్నారు.
ఎంత గట్టిగా చేసినా, ఎంతసేపు చేసినా ఒక్కటే.
శుష్క దండగ అన్నారు.
ఇంతకంటే మరీ దండగమారి పని మరొకటి వుందన్నారు.
అది డబ్బుకట్టి పూజలు చేయించడం అన్నారు.

గుళ్ళో డబ్బుకట్టి పూజారిని పూజ చేయించమంటారు కొందరు.
మహమ్మదీయులైతే మౌల్వీకి డబ్బు ఇచ్చి మీకోసం ప్రార్థించమంటారు.
ఇదే పార్శీలయితే వాళ్ళ పూజారి దస్తూర్ గారి చేత పూజ చేయిస్తారు.
ఇలా పూజారి చేసినా, ఏ మతంవారు చేసినా అది కిరాయి పూజే.
మీ తరపున ఇంకొకర్ని వకాల్తా పుచ్చుకోమంటున్నారు.
ఎవర్ని మభ్యపెట్టాలని చూస్తున్నారని అడిగారు.
దేముడి దగ్గరేనా ఇలా చేయటం ఎంత దగా! ఎంత మోసం! అని
బాబావారు చెప్తుంటే, నిజమేకదా, ఎంత తప్పు చేస్తున్నాం అనుకొన్నారు చాలామంది.
కానీ కొంతమందికి బాబావారి మాట నచ్చలేదు.
మాకు తీరిక లేకనే కదా గుడికి వెళ్ళి డబ్బు కట్టి పూజ చేయమని అడుగుతాం.
మాకే తీరిక వుంటే, మేమే చేసేవాళ్ళం పూజ. ఇందులో తప్పేముంది అనుకొన్నారు.
ఒకాయన వుండబట్టలేకపోయాడు. తన మనస్సులో మాట చెప్పేశాడు.
పూజలు చేయించనంతమాత్రాన భక్తి లేదని ఎందుకు అంటావు బాబా అని అడిగాడు.
ఆ అడగటం కూడా ఏదో గదమాయించినట్లు వుంది.
డబ్బు ఇచ్చి ఎన్ని పనులు చేయించుకోవటం లేదు.
చాకలి వాడికి డబ్బు ఇచ్చి బట్టలు ఉతికించుకోవడం లేదా?
అంట్లు తోమటానికి పనిమనిషిని పెట్టుకోవడం లేదా?
మాకే వీలు వుంటే ఈ పనులు మేము చేసుకొనేవాళ్ళంకాదా!
అలానే పూజలు చేసేంత తీరిక, ఓపిక లేకపోబట్టే కదా, గుళ్ళో చేయిస్తున్నాం.
ఇది ఎలా తప్పవుతుంది అన్నాడు.
ఇలా ఇంత స్పష్టంగా అన్నాడో మనస్సులోనే గొణుక్కొన్నాడో
ఇదిమిద్ధంగా తెలీదు కానీ బాబావారి మాటని మాత్రం
స్పష్టంగా విస్పష్టంగా ఖండించాడు.
భక్తితో చేయించే పూజలకి ఫలితం వుండదంటే ఎలా బాబా అని అడిగాడు.
బాబావారికి అతగాడి ఆంతర్యం అర్థమయింది.
అందుకనే కొంచెం ఘాటుగానే బదులిచ్చారు.
నీదొక మూర్ఖత్వపు వాదన అని చివాట్లు పెట్టారు.
అర్థం పర్థం లేకుండా మాట్లాడుతున్నావన్నారు.
నీ చేతకానితనానికి నిదర్శనం నీ వాగుడు అన్నారు.
వంకలేనమ్మ డొంకపట్టుకు వేళ్ళాడినట్లుంది నీ ధోరణి అన్నారు.
లోకజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నావన్నారు.
ఆ ఆగంతుకుడు ఖంగుతిన్నాడు.

బాబావారు ఇంత తీవ్రంగా స్పందిస్తారని అతగాడు ఊహించలేదేమో,
నోరు విప్పి తప్పు చేశానా అనుకొన్నాడు.
మనస్సులోనే లెంపలు వేసుకొన్నాడు.
బాబావారి ఉవాచని శ్రద్ధగా విన్నాడు.
నీకు దేముడు కావాలి.
నీ కోర్కెలని దేముడు తీర్చాలి.
కానీ నీవు నోరు విప్పి ప్రార్ధన చేయవు.
అందుకని ఇంకో మనిషిని పెట్టుకుంటావు.
ఆ మహానుభావుడి కష్టానికి ఏదో ఇంత అని చేతిలో పెట్టి హమ్మయ్య అనుకొని తృప్తి పడతావు. ఇదేగా నీవు చేయాలనుకొంటున్నది?
బాబావారి మాటల్లో కరుకుతనం లేదు.
అయ్యో పిచ్చివాడా! అమాయకుడివిరా నువ్వు, అన్న జాలి కనిపించింది. తప్పు చేస్తున్నావురా కన్నా అంటున్నారనిపించింది.
డబ్బు ఇచ్చి పూజలు చేయించుకోవడం తప్పు అని ఎందుకు
అనాల్సి వచ్చిందో బాబావారు వివరించారు.
పూజారి గుళ్ళో పూజలు చేస్తున్నాడంటే ఏం చేస్తున్నాడు,
మీరు డబ్బు ఇచ్చాడు కాబట్టి మీకోసం పూజ చేస్తున్నాడు.
అవునా! మరి మీరు ఏం చేస్తున్నారు.
మీ పనులు మీరు చేసుకొంటున్నారు.
మీ పనులు మీరు చేసుకొంటున్నారంటే అర్ధం ఏమిటి!
మీరు మాయలో కొట్టుకుపోతున్నారనే కదా అర్ధం.
పరమార్ధం కోసం పూజలు ఓ ప్రక్కన చేయిస్తూనే
మరో ప్రక్క మీలో కొంత మీరు వుంటున్నారు.
అంటే, ప్రాపంచిక సంతోషాల్లో మునిగిపోవడానికి గుళ్ళో పూజ
ఓ వంక.
ఓ బహానా.
పూజ చేస్తున్నాడు కాబట్టి ఆ పూజారికి ఎంతో కొంత ముట్టచెపుతున్నారు
మీ బరువుని పూజారి భుజాలపై పెడుతున్నారు.
ఇదేమన్నా బాగుందా! అని బాబావారు అడిగారు.
మన మిత్రుడు పదవి కదప లేదు సరికదా వంచిన తల పైకెత్తలేదు.
అయితే బాబావారు అక్షింతల వర్షం ఆగలేదు.
పూజ చేద్దామని వుంది కానీ టైమ్ లేదంటాడు, ఓ పెద్ద మనిషి.

ట్రైమ్ ఎందుకు లేదట. పూజ కోసం ట్రైమ్ కేటాయించాలన్న కోరిక లేదు
కాబట్టి తీరిక లేదు. తీరిక లేదు పని ఒత్తిడిగా వుంది అనటం ఓ వంక.
మాయా ప్రపంచంలో మునిగి తేలాలని మనస్సు కొట్టుకుపోతుంటే
పూజకి ట్రైమ్ దొరకదు. ఎలా దొరుకుతుంది మరి.
మాయలో చిక్కుకుపోయింది మనస్సు.
మాయలో నుంచి బయటపడాలని లేదు.
అలా పూజలు చేయకుండానూ వుండలేడు మనిషి.
పూజారిని పిలిచి పూజ చేయమంటాడు.
దక్షిణ ఘనంగా ఇస్తానంటాడు.
ఇదేమన్నా అందలమెక్కించే ఘనకార్యమా ఏమన్నానా అని
బాబావారు ప్రశ్నించారు.
తరుణోపాయం చెప్పారు.
భగవన్నామస్మరణ చేయాలనుకుంటే నామస్మరణ చేయండి మొక్కుబడిగా కాదు.
మనసావాచా నామస్మరణ చేయండి.
పూజ చేయాలనుకొంటారా మనస్సు పెట్టి శ్రద్ధగా, భక్తితో పూజించండి.
పూజ చేస్తున్న కాస్సేపూ దృష్టి భగవంతుడిపైనే వుంచండి.
ఎన్నిసార్లు ప్రార్థించారు. ఎన్నిసార్లు పూజ చేశారు అన్నది కాదు ముఖ్యం.
మీరు ఎంతసేపు శ్రద్ధగా ప్రార్థించారు అన్నది ప్రధానం.
గంటలు తరబడి మంత్రాలు వల్లించనక్కర్లేదు.
కాస్సేపు భగవంతుడిపై దృష్టిపెడితే చాలు, రోజల్లా ప్రార్థించక్కర్లేదు.
రెండు నిముషాలు శ్రద్ధగా ప్రార్థించినా ఫలితం వుంటుంది.
ఆ రెండు నిముషాలు మీరు చేసే ప్రార్థన భగవంతుడికి వినిపిస్తుంది.
రెండు నిముషాలు చేశాడా, మూడు నిముషాలు చేశాడా ప్రార్థన
అని భగవంతుడు పట్టించుకోడు.
మనస్సు పాడే పాటని భగవంతుడు వింటాడు.
మనస్సుతో చేసే విన్నపానికి భగవంతుడు స్పందిస్తాడు అని
ఈ యుగావతారుడు యుగయుగాలుగా చెప్తున్న ధర్మ సూక్ష్మాన్ని
ధులియా వాసులకి వివరించారు.
జూలై 13 ఉదయం బాబావారికి అబ్దుల్లా తలంటి స్నానం చేయించాడు.
ఈ అదృష్టం నాకు వద్దు అనుకొన్నాడో ఏమో, రావ్ సాహెబ్ గారు,
అబ్దుల్లా ప్రక్కనే నిలబడి నీళ్ళు అందించాడు.
స్నానం అయ్యాక బాబావారు కొత్త నల్లకోటు వేసుకొన్నారు.

కోటు బాగా కుట్టారు బాబా. మీకు సరిగ్గా సరిపోయిందన్నాడు అలీ అక్బరు. తమ చాకలెట్ రంగు కోటును అతగాడికి కానుకగా ఇచ్చారు బాబా. మర్నాడు అంటే జూలై 14వ తేదీన రమ్జూ, రుస్తుమ్, ఫ్రీనీ వచ్చారు. వెంట కొత్త బస్సు తెచ్చారు. బాబాని దర్శించారు. అంజలి ఘటించారు. కొత్త బస్సుని మీరు చెప్పినట్లే తయారుచేశామన్నారు. సాయంత్రం కాగానే రుస్తుం, ఫ్రీనీ నాసిక్ వెళ్ళి వస్తామన్నారు. బాబావారు సరేనన్నారు. వాళ్ళు నాసిక్ దారి పట్టాక, భజన కార్యక్రమం మొదలైంది. అర్ధరాత్రి వరకూ భగవన్నామ సంకీర్తన జరిగింది. జూలై 12వ తేదీ ఉదయం బాబావారు ధూలియా వచ్చిన సంగతి పాఠకులకి గుర్తుంది కదా. ఎవరి ఆహ్వానంపై బాబావారు ఈ నగరం వచ్చారో కూడా గుర్తుంది అనుకొందాము.

ధూలియా పురపాలక సంఘంలో ఇంజనీరుగా పనిచేస్తున్న కాలేమామ అభ్యర్ధనపై బాబావారీ వూరు వచ్చారు. కాలేమామ పేరు చెప్పి ధూలియా వాసుల పంట పండింది. దొరుకునా ఇటువంటి సేవ అని ఎందరో కళ్ళు కాయలు కాసి చూస్తున్న రోజుల్లో అవతారుడు ధూలే వాసుల మధ్య మూడురోజులు గడిపారు. ఎన్నో ఆధ్యాత్మిక రహస్యాలని వివరించారు. ముక్తికి మార్గాన్ని చూపారు. ధర్మ సందేహాలు తీర్చారు. ఎంత అదృష్టవంతులో ఆనాటి ధూలే ప్రజలు. కాలేమామ దంపతులకి ఇదేమీ పట్టలేదు. ప్రభువుకి ఏలోటూ రాకుండా చూడాలన్నదే వాళ్ళ తాపత్రయం.

బాబావారు ఎప్పుడు ఏమి అడుగుతారో, ప్రభు ఆజ్ఞని ఎంత త్వరగా నెరవేర్చాలో అన్నదే వాళ్ళ ధ్యాస. మండలివారికి ఏలోటూ రాకూడదన్నదే వాళ్ళ ఆరాటం. తండ్రికి తగ్గ పిల్లలు బాబూ, మరలీ. వీళ్ళకీ ప్రభువే సర్వస్వం. ఇద్దరూ ప్రస్తుతం మెహెరాబాద్‌లో వున్నారు. పెద్దవాడు అదే బాబుకి అయితే బాబావారి దగ్గరే వుండిపోవాలని వుంది. బాబావారిని మెప్పించి, మండలిలో ఒకడిని అవ్వాలని వుందని తండ్రితో చాలాసార్లు చెప్పాడు కూడా. ఈ అదృష్టం దక్కిందో లేదో తెలుసుకోవాలని వుంటే, పాఠకులు కాస్తంత ఓపిక పట్టాలి. ఎందుకంటే బాబావారు జూలై 15న ఇండోర్‌కి బయలుదేరారు. ప్రభువు కొత్త బస్సు ఎక్కుతుంటే కాలేమామ దంపతులకి పుట్టెడు దు:ఖం వచ్చింది. బాబావారు ఇంకో రెండు రోజులు మా దగ్గరే వుంటే బాగుండుననిపించింది. కానీ మనస్సులో మాట పైకిచెప్పే ధైర్యం లేదు. బాబావారి మాట వినడమే కాని మాకు ఇది కావాలి, అది కావాలి అని అడగటం తెలియదు కాలేమామకీ, ఆయన శ్రీమతి గారికీ. ఇందువల్లనే కదా వీరిద్దరూ బాబావారికి దగ్గర కాగలిగింది. పిల్లలు బాబావారి పంచన మెహెరాబాద్‌లో వుండగలిగింది. ఒకవిధంగా చెప్పాలంటే, బాబావారు చెప్పిన వాంఛరహిత భక్తికి ఈ దంపతులు ప్రతీకలు. **– సశేషం**

# సలామ్, భావూజీ

(మల్లాది రామారావు, మెహెరాబాద్)



భావూ కల్చూరీగా చిరపరిచితులైన వీర్‌సింగ్ కల్చూరి గారు, సలామ్ భావూజీ, సలావ్ం – సలామ్ – భావూజీ అని కీర్తిస్తుంటే బాబా ఒడిలోకి జారిపోయారు

అక్టోబరు 25వ తేదీ సాయంత్రం ఐదు గంటలకి. బాబావారి పురుషమండలి కోసం దిగువ మెహెరాబాద్‌లో కేటాయించిన జాగాలో భావూ కల్చూరి గారు అమరులయ్యారు. ఆ విధంగా సార్థక నామధేయులయ్యారు.

కాల్ – చూరి అన్న రెండు హిందీ మాటల మిశ్రమమే కల్చూరి.

కాల్ అంటే సమయం. చూరి అంటే దొంగ. కాలాన్ని దొంగలించ గలిగినవాడు అమరుడు. అది భావూగారు నిస్సందేహంగా.

“బాబా నేను బ్రతకలేనయ్యా చచ్చిపోవాలని వుంది” అని భావూజీ అంటే, పండు ముసలిగా నా ముందు నడువు. అప్పుడు నీ కోర్కె తీరుస్తాను అన్నారట బాబావారు. ప్రభువు ఆజ్ఞ ప్రకారం ముదుసలిగా నడిచారట వెంటనే భావూ. కానీ, ఎందుకనో బాబావారు ఆయన కోర్కెని వెంటనే తీర్చలేదు సరికదా ఇప్పుడు కాదులే తర్వాత చూద్దాం అన్నారట.

అలా కల్చూరీగా సార్థక నామధేయుడిని చేయటం వల్లనే భావూజీ గారు ఇరవై రెండు ఆపరేషన్లు చేసినా చలించకుండా వుండగలిగారు. మరే మానవమాత్రుడు అన్ని ఆపరేషన్లు తట్టుకోగలిగేవాడు కాదు. ఎన్నిసార్లు ఆస్పత్రికి తీసుకువెళ్ళినా డాక్టర్లు తికమక పడ్డారు తప్ప, భావూజీలో మాత్రం మార్పు వచ్చేది కాదు. ఇన్‌ఫెక్షన్ మాత్రం చాలాసార్లు వచ్చింది. ఈ ఇన్‌ఫెక్షన్ల పర్వంలోనే అహ్మద్‌నగర్ నోబల్ ఆస్పత్రి నుంచి పూనే జహింగీర్ ఆస్పత్రికి మారారు. నాలుగు రోజులు మగతగా పడుకొన్నట్లు పడుకొని అక్టోబరు 23వ తేదీ రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో మౌనంగానే బైబాబా చెప్పారు.

మా రాజుతో నడుస్తానంటూ తమ రారాజు దగ్గరకి వెళ్ళిపోయారు.

"నేను ఈ శరీరాన్ని కాను", అనేవారు బాబా. శరీరంపై మమకారం వద్దన్న హెచ్చరిక అది. శరీరానికి అందని ఆత్మ, అంతటికీ ఆవలగా వుండే పరమాత్మపై దృష్టిపెట్టుకోవాలన్న హితవాక్యం బాబా ఉవాచ. ఇటువంటి ఉవాచలని పుస్తకరూపం చేసి బాబా చరిత్రలో తమకంటూ పదిలమైన స్థానం సంపాదించుకొన్నారు భావూ కల్చురి. పుట్టింది రాజవంశమైనా పెరిగింది సామాన్య కుటుంబం.

ఇంటిలో చదువుల వాసన అంతగా లేకపోయినా మూడు డిగ్రీలు సంపాదించిన వ్యక్తి. వ్యవసాయ శాస్త్రంలో, న్యాయ శాస్త్రంలో పట్టభద్రుడై ఏం సాధించావని ఎద్దేవ చేసిన వాళ్ళకి ఏం తెలుసు, ఈ డిగ్రీలు బాబా ట్రస్టు అధ్యక్షులుగా అక్కరకు వస్తాయని. అంతేకాదు, అంతిమ యాత్ర కూడా ట్రాక్టరులో జరుగుతుందని. గమ్మత్తు ఏమంటే, భావూజీ రెండే రెండుసార్లు ట్రాక్టరు యాత్ర చేశారు. మొదటిసారి వ్యవసాయశాస్త్ర పరీక్ష కోసం. బీటలు తీసిన పొలంలో ట్రాక్టరు నడపడం పెద్ద పరీక్ష అయింది. అంటూ అలనాటి కష్టాన్ని కళ్ళకి కట్టినట్లు చెప్తుంటే శ్రోతల కడుపుబ్బ నవ్వేవారు.

రెండవ యాత్ర మండలి హాలు నుంచి సమాధి స్థలం వరకూ పూలతో అలంకరించిన ట్రాక్టరు పైన. దిగువ మెహెరాబాద్ ఎంతగా మారినా, మండలి హాలు నుంచి సమాధి స్థలం వరకూ రోడ్డు మాత్రం అంతగా మారలేదు. గతుకులు కంటే రాళ్ళు ఎక్కువ వున్నాయి ఈ దారిలో. వాటిని దాటుతూ వెళ్ళటం పొలం గట్టుపై వెళ్ళటం ఒకటే.

మెత్తటి ముఖమల్ గుడ్డతో చేసిన శవపేటికలో భావూజీని పడుకోపెట్టారు.

**"జపూ తుమ్‌హారా నామ్ మెహెర్"** అని పాడుతుంటే ట్రాక్టరు కదిలింది. జంగ్లీ మాస్టరు గారు బాబాలో కలిసినప్పుడు చుట్టుప్రక్కల వారు చాలామంది వచ్చి అంతిమ నివాళినర్పించారు. "ఇప్పుడు ఇంకా ఎక్కువ మంది వస్తారు అంత్యక్రియలకని నిర్వహించడం కష్టమవుతుందేమోనని", టెడ్ జడ్సన్ భయపడ్డాడు. అయితే పూనే నుంచి భావూజీని వెంటనే తీసుకురాకపోవటంతో, అన్ని ఏర్పాట్లనీ ఓ క్రమ పద్ధతిలో నిర్వహించడానికి వీలయిందట. ఏరుచ్ గారు బాబాలో కలిసినప్పటి అనుభవం అక్కరకు వచ్చిందని టెడ్ చెప్పాడు. పురుష మండలి సమాధులున్న ప్రాంతం రాతిమయం. ఆ రాళ్ళని పగలగొట్టి గొయ్యి చేయడం ఓ పట్టాన సాధ్యం కాదు. అయితే పాద్రీ ముందుచూపుతో సమాధుల కోసం గోతులు త్రవ్వించాడు 1970 దశకంలోనే.

అయితే అక్టోబరు 25న ఓ చిక్కు ఎదురయింది. భావూ శవపేటిక కొంచెం పెద్దది అయింది. గొయ్యి అంచుల్ని కొంచెం కొంచెంగా వెడల్పు చేశాము అవసరానికి తగ్గట్టు అని టెడ్ వివరించాడు. ఆఖరి నిద్ర ఐదు గంటలకి అన్నారు.

టేబుల్ గది నుంచి పిలిగ్రిమ్ సెంటర్ వరకూ అక్కడి నుంచి ఆలీషా సమాధి వరకూ బాబా జనం బారులు తీరారు. కొందరు రిక్షాల్లో వచ్చారు. మరికొందరు కార్లలో బస్సులో

వచ్చారు. ఇంకొందరు విమానంలోనూ, రైల్లోను వచ్చారు. ఇలా ఎక్కడెక్కడి నుంచో తమ భావూజీకి శ్రద్ధాంజలి ఘటించడానికి వచ్చిన వారందరూ పూలు, మట్టి జల్లి జైబాబా చెప్తుంటే, సలామ్ భావూజీ సలామ్, సలామ్ అంటూ పాడారు ఇంకొందరు. చీకట్లు ముసిరే సమయానికి బారులు తీరిన జనం కదిలి వెళ్ళిపోయారు.

అప్పుడు మొదలైంది "గమేళా యోగం". 83 సంవత్సరాల జాల్ దస్తూర్, 38 ఏళ్ళ కుర్రాడిలా దగ్గరుండి నడిపించారు గమేళా యోగాన్ని. ఇంకకీ గమేళా అంటే తట్టలో మట్టిని నింపి నలుగురి చేతుల మీదుగా సమాధిలోకి సమర్పించడం. బాబావారు సమాధిలో అవిరళ విశ్రాంతికి వెళ్ళినప్పుడు, గమేళా యోగం జరిగింది. ఆ భాగ్యాన్ని దక్కించుకోలేని నా వంటి వారికి అక్టోబరు 25న ఆ సద్భాగ్యం లభించింది.

ఎక్కడో దూరంగా అందరికీ వెనుకగా వుండే నన్ను ముందు వరసల్లోకి లాక్కువచ్చి, కల్చూరి వంశస్థుడిని చేసి రామ్ సింగ్ కల్చూరిగా మార్చిన భావూజీకి నేను సయితం అని అనుకోగలిగాను. ఆ ప్రకారంగా కల్చూరి వంశం గురించి భావూజీ తరుచు ప్రస్తావిస్తుంటే కొంతమందికి ఇబ్బందిగా వుండేది. ఏమిటి! ఈ పెద్దమనిషి, తమ వంశాన్ని బాబాకి ఉత్తరాధికారిగా మారుస్తున్నాడా అన్న విమర్శ వినిపించేది. అయినా భావూజీ తొణకలేదు సరికదా కల్చూరీ వంశ ప్రస్తావన మానలేదు. ఎందుకో తెలుసా? ఆయన లక్ష్యం వేరు గనుక. వంశాలు శాశ్వతం కాదు.

వాటిని పట్టుకు వ్రేళ్ళాడకండి అని హెచ్చరించడం ఆయన ధ్యేయం కనుక. మరి కల్చూరి వంశం ఏమయిందో చూడండి. ఒకప్పుడు మా వాళ్ళ రోజులు. ఇప్పుడేది ఆ రాచరికం. కాలగర్భంలో కలిసిన మా రాచరిక చరిత్రకి తార్కాణంగా మిగిలిన కల్చూరి మ్యూజియంలో దాచిన ఆనాటి నాణాలు.

ఇదీ ఆయన చెప్పకనే చెప్పిన సత్యం. ఆ సత్యం తెలుసుకోవాలనుకుంటే, చెవులు రిక్కిరించి వినాలి. మనస్సుపెట్టి కూర్చోవాలి.

స్వతహాగా కవి కాబట్టి, కథలు చెప్పడంలో నేర్పరి కాబట్టి భావూజీ చెప్పిన తీరు విలక్షణంగా వుండింది. మొదటిసారి విన్నవారికి, రెండవసారి విన్నవారికీ అర్థంకాక తికమక పడి పెడార్థాలు తీసుకొనేవారు. తినగ తినగ వేమ తీయనగు అన్న నానుడి ప్రకారం ఒకటికి పదిసార్లు విన్నవారికి భావూజీ మాటలు ఎబ్బెట్టుగా కనబడలేదు సరికదా ఓ సత్యాన్ని ఎంత స్పష్టంగా చెప్పగలిగారు అనుకొనేవారు.

ఈ శైలి ఆయన పాటలలో కూడా కన్పిస్తుంది. ఈ పాటలు దక్షిణాదిన కంటే ఉత్తరాదిన ఎక్కువ వినిపిస్తాయి. **"జపూ తుమ్‌హారా నామ్ మెహెర్"** బ్రహ్మ, విష్ణు, మహేశ్ వంటి పాటల్లో బాబా అవతార విశిష్టత కళ్ళకి కట్టినట్లు కన్పిస్తుంది. కొన్ని పాటలకి స్వయంగా బాబావారే స్ఫూర్తినిచ్చారు. "ఆదిసచేతన" అన్న ఆరతి అటువంటిదే. ఆ ఆరతికి తమకి నచ్చిన వరస కట్టాక ఇప్పుడు పాడకండి. "నేను శరీరం వదిలాక, పాడండి", అని

ఆజ్ఞాపించారు. ఆ ఆజ్ఞని పెద్ద ఆదీ నిర్వర్తించారు.

బాబా శరీరకంగా దూరం కావటంతో కృంగిపోవటం భావూజీ వంతయింది. ఆ దిగులు నుంచి బయట పడటానికి 'లార్డ్ మెహెర్" రచన తోడయింది. ఏడు నెలలపాటు ఏకధాటిగా ఆ ఉద్గ్రంథం రచన సాగింది. హిందీ భాషలో ద్విపదగా వెలిసింది. దరిమిలా ఫ్రేం బాక్స్‌వాలా, ఫెన్‌స్టర్‌ల పుణ్యమా అని ఇంగ్లీషులో వెలుగుచూసింది. మొదటి ముద్రణ అమెరికాలో. ద్వితీయ ముద్రణ మన తెలుగు బాలాజీ పుణ్యం. మెహెర్ మౌనవాణి పబ్లికేషన్ ద్వారా లార్డ్ మెహెర్ అందరికి అందుబాటులోకి వచ్చింది.

వాల్మీకి రామాయణం తరువాత ఎన్నో రామాయణాలు వెలుగుచూశాయి.

ఇంకా ఎందరో రామాయణ కల్పవృక్షాలు వ్రాస్తున్నారు.

ఇంకెందరో వ్రాస్తారు. మెహెరాయణం విషయంలోనూ అంతే జరుగుతుంది.

ఎన్నో లార్డ్ మెహెర్‌లు ముమ్ముందు వస్తాయి.

అయితే వాల్మీకి రామాయణం ఎలా నిలిచిపోయిందో,

భావూజీ కల్చూరీ లార్డ్ మెహెర్ కూడా చరిత్రలో నిలిచిపోతుంది. కాలాన్ని దొంగిలించే కల్చూరి రచన తరతరాల వారి మనస్సులని దోచుకుంటుంది. ఎన్నో తరాలకి స్ఫూర్తినిస్తుంది.

ఈ సుదీర్ఘయాత్రలో అక్టోబరు 25వ తేదీ శుక్రవారం ఒక మజిలీ పూనే జహంగీర్ ఆస్పత్రి నుంచి ఉదయం ఐదు గంటలకి మొదలయింది. అంబులెన్స్, దాని వెనకాల నాలుగు కార్లు, ట్రస్టు కాంపౌండ్ అవి చేరేసరికి ఎనిమిది అవుతోంది. "భావూజీ"ని స్ట్రెచర్‌పై రమ, మెహెర్‌నాథ్, రాజ్‌ల వాకిటికి తీసుకువెళ్ళారు. వెంట షీలా, డేవిడ్ ఫెన్‌స్టర్, మనమడు అమ్మన్, అతని భార్య స్టెఫెనీ కదిలారు.

ఆదీమ్, జతిన్‌లు కూడా వాళ్ళ వెంటవున్నారు. హరి పరమాత్మ నామం చెప్పి, పర్వవర్దిగార్ ప్రార్థన, పశ్చాత్తాప ప్రార్థన చేశారు. మెహెర్ నజర్‌గా ప్రసిద్ధి చెందిన ఆ యింట ఎన్నో జ్ఞాపకాలు దాగి వున్నాయి. మణి, ఏరుచ్ ఇక్కడి నుంచే ట్రస్టు పనిచేశారు. వారి గదులు ఇప్పటికీ అప్పటిలానే వున్నాయి. ట్రస్టు ఛైర్మన్‌గా, బాబా గ్రంధ రచయితగా భావూజీ 1977 నుంచి ఇక్కడే వున్నారు. ఆ తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకొంటూ భావూజీని నగర్ సెంటర్‌కి తీసుకువచ్చారు.

బాబావారు స్వయంగా ప్రారంభించిన సెంటర్ ఇది. ఇక్కడ బాబావారి సమక్షంలో ట్రస్టు సిబ్బంది, భావూజీకి ఇష్టమైన పాటలు పాడారు. రోజూ మధ్యాహ్నం, సాయంత్రం రెండు పూటలా భావూజీ గదికి వెళ్ళడం, సర్వమత ప్రార్థనలు చేయడం వాళ్ళకి ఓ అలవాటు. ఇహ ఆ అలవాటుకు తెర పడుతోంది.

తొమ్మిదిన్నరకి "భావూజీ" మెహెరాబాద్ కొండపైకి వచ్చారు. సమాధి ముంగిట "విశ్రాంతి"గా నడుం వాల్చారు. కుటుంబ సభ్యులు సమాధిలో బాబావారికి పుష్పాంజలి ఘటించారు. అందరూ సత్‌చిత్ ఆనంద పరమానంద నామ జపం చేశారు. గుజరాతీ

ఆరతి, ఆస్ట్రేలియన్ ఆరతి పట్టారు. "అవతార్ మెహెర్‌బాబాకీ జై" అంటుంటే భావూజీ యాత్ర దిగువ మెహెరాబాద్‌కి మొదలైంది. మెహెరాజాద్ సంగతి మరచిపోలేదు కానీ ఆ ప్రస్తావన రాలేదు. దానికి భావూజీయే కారణం. జూన్‌లో అంటే బాగా అస్వస్థులు అవటానికి కొద్ది రోజులు ముందు భావూజీ సమాధికి చాలాసార్లు వచ్చారు. మెహెరాజాద్‌కీ వెళ్ళారు. అప్పుడోసారి అన్నారట, "ఇప్పుడు అంతా అయిపోయింది. నేను చనిపోతే నా శరీరాన్ని మెహెరాజాద్ తీసుకురానక్కర్లేదు" అని చెప్పారట.

ఆయన చెప్పినట్లే జరిగింది. ఈ సంఘటన జరిగిన పది పదిహేను రోజులకి మౌనదినం వచ్చింది. భావూజీ బాబాలో కలిసిపోయారన్న వార్త పొక్కింది. సమాధి దగ్గర మౌనంగా వున్న నా వంటి చాలామంది ట్రస్టు ఆఫీసుకి పరుగెత్తారు. భావూజీ నవ్వుతూ కనిపించారు. దరిమిలా ఒకటి రెండుసార్లు ఇటువంటి వార్త రావడం, తెరపడింది అనుకోవటం జరిగాయి.

అందుకనే అక్టోబరు 23వ తేదీ నాటికి పరిస్థితి మారింది. పూనే ఆస్పత్రిలో భావూజీని చూసినవారికి గుండె గుభేలుమంది. ఎంత కష్టపడుతోందీ శరీరం అనిపించింది. బహుశా ఈ మౌన ఘోషని విన్నట్లున్నారు బాబా, ఆయనకి ప్రియమైన రాత్రి వాచమన్ కథ మలుపు తిరిగింది. మండలి హాలు దగ్గర ఆగింది.

బాబావారి కుర్చీకి ఎదురుగా **ఆయన జాన్** సేద తీరారు. ఎడమ ప్రక్క కుటుంబీకులు కూర్చొన్నారు. కుడి ప్రక్క ఎక్కడెక్కడి నుంచో వచ్చిన గాయకులు బాబా నామ జపం చేశారు. భావూజీ పాటలు పాడారు. ఇంగ్లీషులో, హిందీలో మరాఠీలో, తెలుగులో, స్పానిష్ భాషలో, పార్శీ భాషలో, చైనా భాషలో మనస్సులో మాట చెప్పారు.

**కోటి దేవతలు దిగివచ్చి కోరిక ఏమంటే మెహెర్ చరణ సేవ** అని బదులు ఇస్తామన్నారు.

ఇంతలో నాలుగు గంటలకి ఆస్ట్రేలియా నుండి చిన్న మనవడు జూబిన్ వచ్చాడు. పంప్‌కిన్ హౌస్ శరణాలయం పిల్లలు బాబా నామం చెప్పారు.

ఇది సంతాపానికీ, ధన్యవాదాలకీ సమయం కాదు అన్నారు మెహెర్‌నాథ్ కల్చూరి. నిజమే కదూ అనిపించింది అందరికీ. అయినా మాటలకందని మూగ వేదన తప్పలేదు భావూజీతో అనుబంధం అటువంటిది.

ఏరుచ్, మణి, ఆదీ, పాద్రీ వంటివారిని కలిసే అవకాశం దొరకని ఎందరికో భావూజీతో పరిచయం మధురమైన అనుభవం. పిల్లల్లో పిల్లవాడిగా, పెద్దల్లో పెద్దవాడిగా, విదేశీయులతో, స్వదేశీయులతో అరమరికలు లేకుండా కలిసిపోయిన భావూజీ అందరికీ దగ్గరవాడయ్యాడు. అందరివాడయ్యాడు. అందుకనే హమీర్‌పూర్, హైదరాబాద్, నాగపూర్, వార్ధ, అమరావతి, అకోలా, ఢిల్లీ – ఇలా ఎక్కడెక్కడి నుంచో ఎందరో పెద్దలు పిన్నలు వచ్చారు. అమెరికా నుంచీ, ఇంగ్లాండు నుంచీ ఇరాన్ నుంచీ మరెందరో వచ్చారు.

ఐవాక్ విత్ ది కింగ్, విక్టరీ అన్ టూ దీ, ఓపెన్ ది డోర్, సలామ్, సలామ్ భావూజీ అని పాడుతూ అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు.

*

# నిజామాబాద్ సెంటర్ పసిడి పండుగ వేడుకలు

**(పి.యస్.కె.శర్మ)**



నిజామాబాద్ బాబా సెంటర్ స్వర్ణోత్సవాలు 2013 నవంబరు 9, 10 తేదీలలో వైభవంగా జరిగాయి. తెలుగువారు పలు జిల్లాల నుంచి వచ్చారు. అలాగే ఈ వేడుకలకు ఉత్తరాది వారు కూడా అనేక ప్రాంతాల నుండి హాజరయ్యారు. ముంబాయి నుండి బాబా ప్రేమికులు సోరబ్-రుస్తుంలు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసారు.

అలాగే ప్రతాప్ ఆహిర్, దీపక్ థాడే, జె.యస్. దుబే (ఇండోర్), తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు. పనసన్న, దీవి సుబ్బారావు, మలకపల్లి మల్లిఖార్జునరావు, ఎ.వి.జి. హరిప్రసాద్, శ్రీమతి సుబ్బలక్ష్మి, అవతారుని సందేశాలపై ప్రసంగించారు. ముందుగా, శ్రీ కోడూరి ప్రసాద్, మెహెర్‌స్థాన్, సప్తవర్ణ పతాకావిష్కరణ చేశారు. శ్రీ బి. రామకృష్ణయ్య కార్యక్రమాలను చక్కగా నిర్వహించారు.

1963 నవంబరులో నిజామాబాద్ బాబా సెంటర్‌ను బాబా ప్రేమికులు శ్రీ రెంటాల సూర్యనారాయణ మూర్తి తన ఇంట్లోనే నెలకొల్పారు.

ఆ సెంటర్ నేడు ఇంతింతై వటుడింతైన చందాన విశాలమైన స్వంత భవన ప్రాంగణంలో పసిడి పండుగ వేడుకలు జరుపుకుంటోందని, కేంద్ర అధ్యక్షులు శ్రీ కాశీనాథ్ పవార్ విచ్చేసిన ఆహుతులకు స్వాగతం పలికారు. తొలి రోజున శ్రీ ప్రతాప్ ఆహిర్ ధుని ప్రజ్వలన చేశారు. అనంతరం ఉ.11 నుండి 2 గంటల దాకా నిజామాబాద్ పట్టణ పురవీధుల

గుండా అత్యంత సుందరమైన శోభాయాత్ర నిర్వహించారు. రెండు గుర్రాలు ముందుండగా తెల్లని రథంపై అవతారుని చిత్రపటంతో అతిపెద్ద నగర సంకీర్తన కన్నుల పండుగగా జరిగింది.

కుమారి సంప్రీతి నృత్యం, స్థానిక సెంటర్ బాల బాలికలు చక్కని సాంప్రదాయ నృత్యం చేశారు. మల్కిపురం రామారావు, మల్లిక్ బృందంతో పాటు పలు సెంటర్ల నుండి విచ్చేసిన ప్రేమికులు అవతారుని సంకీర్తనలు, భజనలు కడు రమ్యంగా చేశారు.

కాగా, ఎవిజి హరిప్రసాద్ సహవాస్‌కి హాజరైన బాబా ప్రేమికులనుద్దేశించి మాట్లాడుతూ "మనం బాబా సహవాస్‌కి హాజరవుతున్నామని అవతారుడు సంతోషించాలన్నారు. సహవాస్‌లో పాల్గొనేవారు మనస్సు, హృదయం, శరీరం ఒక్కచోట ఉంచేలా ప్రయత్నించాలని హితవు పలికారు.

మన కోసం జీవించడం పశుత్వంతో సమానం. మనం-మన తోటి వారు ఆనందంగా ఉండాలనుకోవడం మానవత్వం, ఇతరుల కోసం జీవించడం దైవత్వం అని బాబా సందేశాన్ని వివరించారు.

రుస్తుం - సోరబ్‌లు తమ సహజ చతురతతో సంభాషించారు. వీరిద్దరు కవలలు, అవతారునికి సమీప బంధువులని పాఠకులకు తెలుసు. వారు తమ చిన్ననాటి విషయాలను చిట్టి కథలుగా ఆసక్తికరంగా చెప్పారు.

ఒకసారి బాబాతో గోలీలాట ఆడుతుంటే, బాబా తీక్షణంగా ఒకే ఒక గోలీతో గురి పెట్టి ఐదింటిని పగులగొట్టారు.

ఇక ఆ తర్వాత ఆట ముగిసిందని తన గదిలోకి వెళ్ళిపోయారని చెప్పారు.

ఆ తర్వాత మహారాష్ట్రలోని సతారాలో బాబా ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురయ్యిందని వారు గుర్తు చేశారు.

బాబా ప్రేమికులు పలువురి ప్రసంగాలు ఆసక్తికరంగా, ఆలోచనాత్మకంగా ఉన్నాయి.

సెంటర్ కార్యదర్శి, శ్రీ ఎ. జనార్ధన్‌రావు తదితర సెంటర్ నిర్వాహకులు విచ్చేసిన బాబా ప్రేమికులందరికీ విసుగూ విరామం లేకుండా విశేష సేవలందజేశారు. నిజామాబాద్ సహవాస్ ఒక మధురానుభుతిని అందజేసింది. జైబాబా.

*

# పత్రిక నిలిపివేశాం

మెహెర్‌బాబా పత్రికకు గత రెండు మూడేళ్ళకు పైగా వార్షిక సభ్యత్వం చెల్లించనివారికి ఎర్రని చిరునామాలు అతికించి సుమారు నాలుగు నెలలు పైగా పంపాం. ఐనా కొందరిలో స్పందన లేదు. గావున అట్టి చిరునామాలకు 2013 అక్టోబరు సంచిక నుండి పత్రిక పంపుట నిలిపివేశామని గమనించగలరు.

# విజయవాడ

శ్రీ వై.ఎస్. రావు, కార్యదర్శి, కొవ్వూర్ మెహెర్‌స్థాన్ ధర్మశాల, ఆంధ్ర రెస్ట్ హౌస్, మెహెరాబాద్ 14.10.2013 అర్ధరాత్రి హఠాత్తుగా మెహెరాబాదు నందు బాబాలో ఐక్యమయినారని తెలిసి బాబా ప్రేమికులు ఆయన బాబా కొరకు చేసిన సేవా కార్యక్రమాలు కొనియాడి, ఆయన ఆత్మకు శాంతిని ప్రసాదించాలని బాబాను ప్రార్థిస్తూ సంతాప సూచకంగా 2 నిముషాలు అందరూ మౌనం పాటించారు. వారి కుటుంబ సభ్యులకు బాబా మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించటమైనది. మరియు వారి కుటుంబ సభ్యులకు విజయవాడ బాబా సెంటరు తరపున సంతాపం తెలియజేయటమైనదని శ్రీ ఎన్.బి.ఎస్.ఎస్.జి. శర్మ, కార్యదర్శి తెలిపారు.

# చల్లపల్లి

ఆంధ్రా బాబా ప్రేమికులకు అత్యంత ఆప్తులు శ్రీ వై.ఎస్. రావుగారు నిరంతర బాబా సేవలో ఓలలాడుచూ తుదిశ్వాస విడిచినారని తెలిసి ఆంధ్రా ప్రాంతవాసులను తీవ్ర దిగ్భ్రాంతికి లోనుచేసింది. మా సెంటరు కోశాధికారి శ్రీ చెక్కా నాగ వెంకట సీతారామయ్య కొంత తడవు షాక్‌కు గురైనారు. వై.ఎస్. రావు గారి కుటుంబసభ్యులకు ఆంధ్రా ప్రేమికలోకానికి మనోధైర్యాన్ని కలుగచేయాలని బాబాని ప్రార్థిస్తూ మా సెంటరు నందు సంస్మరణ కార్యక్రమము 14.10.2013 సోమవారం జరిపి 2 నిముషాలు మౌనం పాటించితిమి.

# ఢిల్లీ మేళా

మెహెర్ ప్రేమ మేళా సహవాస్ ఢిల్లీలో 2013 డిశంబరు 1 నుండి 3 వరకు జరుగుచున్నది. ఈ ప్రేమ మేళాకు మెహెర్‌నాథ్ కల్చురీ తదితరులు హాజరవుతున్నారు. ఆసక్తి గల బాబా ప్రేమికులు తప్పక హజరుకావల్సిందిగా కోరుతున్నారు. మరిన్ని వివరాలకు మనోజ్ సేథీ (011-43169000/43169001) సంప్రదించగలరు.

# పావగడ

హరిప్రసాద్ (బెంగళూరు) ఆధ్వర్యంలో పావగడలో నిర్వహించిన సహవాస్ కార్యక్రమము 28.10.2013న చాలా చక్కగా జరిగినది. ఈ కార్యక్రమములో, ప్రసంగాలు, సూఫీ గీతాలు, సంకీర్తనలు జరిగాయని కార్యదర్శి శ్రీ నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు.

# బాబాలో ఐక్యం



శ్రీ టి. వెంకట్రావు (విశాఖపట్నం) గారి తల్లి శ్రీ ఎర్రాయమ్మ 2013 అక్టోబరు 10న బాబాలో ఐక్యమయ్యారు. ఎంతోకాలంగా బాబా నామస్మరణలో గడిపిన ఆమె ధన్యురాలని స్థానికులు తెలిపారు.

## మల్లాది వారి వివాహం

శ్రీమతి శ్రీ మల్లాది వాణీరాం, రామారావు గార్ల ఏకైక పుత్రిక చి.ల.సౌ, మెహెర్ క్రిష్ణ షీల వివాహం చి॥ శ్రీనివాస గిరిధర్ శ్రీపాదతో హైదరాబాద్‌లోని ఇస్కాన్ దేవాలయం అబిడ్స్‌లో 2013 నవంబరు 19 రాత్రి ఘనంగా జరిగింది. పలువురు బాబా ప్రేమికులు హాజరయ్యారు.

## రెడ్డి గారి వివాహం

శ్రీమతి రెడ్డి గారి సుధారాణి, అనంతశయన రెడ్డి గార్ల పుత్రిక చి॥ల॥సౌ॥ మెహెర్ సంహిత వివాహము చి॥ రాజేష్ కుమార్ రెడ్డితో 23.10.2013, హైదరాబాద్‌లో ఘనంగా జరిగినట్లు బాబా ప్రేమికులు తెలిపారు.

## చిలుకూరి వారి వివాహం

శ్రీమతి శ్రీ చిలుకూరి అరుంధతి, మురళీకృష్ణ గార్ల ఏకైక పుత్రుడు చి॥ మెహెర్ మధు వివాహము చి॥ల॥సౌ॥ ప్రదీప్తితో 13.11.2013 హైదరాబాద్‌లో ఘనంగా జరిగినట్లు బాబా ప్రేమికులు తెలిపారు.

## పెంచాల వారి వివాహం

శ్రీ పెంచాల ప్రభాకర్‌రావు, శ్రీమతి లత గార్ల ఏకైక పుత్రిక చి॥ల॥సౌ॥ ప్రవిత వివాహము చి॥ ప్రతాప్‌తో ది: 13.11.2013, బుధవారం రోజున ఉదయం గం॥ 10.46 ని॥లకు, సత్యసాయి గార్డెన్స్ (హైటెక్ ఫంక్షన్ హాల్), బైపాస్ రోడ్, బొమ్మకల్, కరీంనగర్‌లో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపినారు.

## ఏలూరి వారి వివాహం

శ్రీమతి శ్రీ ఏలూరి కమల, రవీందర్ గార్ల కుమార్తె చి.ల.సౌ. శ్రియ వివాహం చి॥ కిరణ్‌కుమార్‌తో ది: 23.11.2013 శనివారం ఉ. 11.55 ని.లకు బాలాజీ ఫంక్షన్ హాలు, రామాయంపేటలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపినారు.

## విరాళములు

1. శ్రీ కె. కుటుంబరావు, తాడేపల్లిగూడెం గారి భార్య శ్రీమతి కె. ధనలక్ష్మి రూ. 1000/- అలాగే సింగపూర్‌లో వుంటున్న వారి కుమార్తె శ్రీమతి దీప్తి తన కుమార్తె చి॥ దీక్షిత తర్పున రూ . 500/- పంపినారు.
2. శ్రీ యం. జగన్మోహన రావు, బొల్లారం, హైదరాబాద్ రూ. 500/- అందజేశారు.

# క్రొత్త పుస్తకం




బాబా ప్రేమికలోకానికి అందిస్తున్న 135 పేజీలు గల తెలుగు పుస్తకం సార్థకజన్ములు.

మెహెరాబాద్‌లో వుంటున్న బాబా ప్రేమికులు శ్రీ అన్నాఖండాలే ఇంగ్లీషులో ప్రచురించిన **టియర్స్ ఆఫ్ ది జాయ్** పుస్తకాన్ని శ్రీ మల్లాది కృష్ణానంద్ తెలుగులో అనువదించి, ఆ చిరుపొత్తానికి సార్థకజన్ములు అని పేరు పెట్టారు. మెహెర్‌బాబాకు ఎంతో విధేయతతో సంపూర్ణంగా అంకితమై జీవించిన ముగ్గురు పెద్దలు వరుసగా 1. గుస్తాద్‌జీ, 2. ప్లీడర్ 3. కృష్ణనాయర్‌ల జీవనరేఖాచిత్రాలు ఈ చిన్ని గ్రంథంలో ఎంతో వివరంగా గ్రంథస్తం చేయడమైంది. సాక్షాత్తూ యుగావతారుని నీడలో నడుచుకున్న ఆ ముగ్గురూ ధన్యులు, సార్థకజన్ములు అని రచయిత అభిప్రాయపడ్డారు. ఈ మువ్వురి జీవన చిత్రాలూ చిత్రంగా భిన్నమైనవి. గుస్తాద్‌జీ సాయినాథుని సన్నిధిలో, ఉపాసనీ మహరాజ్, బాబాజాన్‌లకు తన సేవలను అందించాడు. ప్లీడర్ చిన్ననాటి నుండీ గొప్ప భగవదన్వేషకుడు. కేవలం 30 సంవత్సరాల వయస్సులో తనకు మోక్షం కావాలి, బ్రహ్మైక్యం సిద్ధించాలనే లక్ష్యంతో పంచ సద్గురువులలో నలుగురు సద్గురువులను దర్శించుకుని చివరాఖరికి 1928 జనవరిలో మెహెర్‌బాబాను దర్శించుకున్నాడు. దాదాపుగా ఆనాటి నుండీ మెహెర్ బాబా ఆదేశాలు పాటించాడు. మెహెర్ బాబా ప్రవచనాలను తు.చ. తప్పక అమలు చేశాడు. 62 సంవత్సరాల వయస్సులో 1960 ఫిబ్రవరి 26న మెహెర్‌బాబా సమక్షంలోనే దివ్యకాంతి పుంజం దర్శించుకున్నాడు. అలాగే, అవతారునితో కృష్ణనాయర్ అనుభవాలు – అనుభూతులు వినేవారికి ఆశ్చర్యంతో మేను పులకరిస్తుంది. మెహెర్‌బాబా స్వయంగా ఎంపిక చేసుకున్న ధన్యుడు– శ్రీ కృష్ణనాయర్. ఈ ముగ్గురూ అవతారుని తొలితరానికి చెందిన అత్యంత సన్నిహిత ప్రేమికులు. అవతారుని ఆదేశాలు వారు అమలు చేసిన వైనం, నేటి తరం బాబా ప్రేమికులు తప్పక తెలుసుకోవాలి. ఇదొక అరుదైన సమాచారం. మెహెర్‌బాబా పత్రిక తరపున ప్రచురితమౌతున్న ఈ గ్రంథం, త్వరలో విడుదల కానుంది. **సార్థకజన్ములు** – తెలుగువారందరూ తప్పక చదివి భద్రపరుచుకోవల్సిన గ్రంథం. పరిశీలించండి త్వరలో...,

*

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశనము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు, నీవు
పరబ్రహ్మవు,పరమాత్మవు
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు బాబా కొంగును చిట్టచివరి వరకు దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యత్వం

**2013** అక్టోబరు – నవంబర్ నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 01 | నవంబర్ | మురళీకృష్ణ, విజయవాడ | రూ. 1000.00 |
| 02 | నవంబర్ | జె. లలితాబాయ్, హైదరాబాద్ | రూ. 1000.00 |
| 03 | నవంబర్ | దత్తాత్రేయ రావు, హైదరాబాద్ | రూ. 1000.00 |
| | | మొత్తం | రూ. **3000.00** |

# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/– (వెయ్యి రూపాయలు).
2. రెండు దఫాలుగా కూడా రూ.500/– చొప్పున చెల్లించవచ్చు.
3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది.
4. వార్షిక సభ్యత్వం రూ.100/– పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది.
5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

## మా అడ్రస్:


**ఎడిటర్, మెహెర్‌బాబా,**

**గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,**

**యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ,**

**సికింద్రాబాద్–500087. ఫోన్:99595–53218, 040–27860079**

**email: malladisukku@gmail.com**



Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310,
Postal Concession: R&D/RNP/HSE/789/2012-2013
**Dt.19-12-2011**